సిద్దిపేట | గురువారం | 18-12-2025 | సంపుటి: 3 | సంచిక: 201 | పేజీలు: 8 | వెల:రూ.2/- https:yaadharthavaadhi.in ఎడిటర్: బింగి సత్తయ్య
CIRCULATED IN HYDERABAD, SIDDIPET, SANGAREDDY, KARIMNAGAR, WARANGAL, KHAMMAM, NIZAMBAD, MAHBOOBNAGAR, KARNOOL, VIJAYAWADA, GUNTUR, RAJAMUNDRY, VIZAG




# తెలంగాణలో ముగిసిన పల్లెపోరు

- మూడో విడతలో పలు చోట్ల స్వల్ప ఘర్షణలు
- ఉదయం నుంచే క్యూలో నిలబడ్డ ఓటర్లు

“మొదటి, రెండో విడతల ఎన్నికల మాదిరిగానే మూడో విడత తెలంగాణ సర్పంచ్ ఎన్నికల్లో అధికార కాంగ్రెస్ పార్టీకి బీఆర్ఎస్ గట్టి పోటీనిచ్చింది. బుధవారం మూడవ విడతలో భాగంగా 3,752 గ్రామ పంచాయతీలకు, 28,410 వార్డులకు పోలింగ్ జరిగింది. ఈ విడతలో సుమారు 53 లక్షల మంది ఓటర్లు తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. మధ్యాహ్నం 1 గంట ప్రాంతంలో పోలింగ్ ముగిసింది. 2 గంటల నుంచి ఓట్ల లెక్కింపు చేపట్టారు. రాష్ట్ర వ్యాప్తంగా గ్రామపంచాయతీ ఎన్నికలు చెదురుమదురు ఘటనలు మినహా ప్రశాంతంగా కొనసాగాయి. వికారాబాద్, రంగారెడ్డి జిల్లాల్లో స్వల్ప ఉద్రిక్తత నెలకొన్నది. పోలింగ్ బూత్‌లో ప్రచారం చేస్తున్నారంటూ కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలకు చెందిన పోలింగ్ ఏజెంట్లు పరస్పరం దాడులు చేసుకున్నారు.”

## 20,21 తేదీల్లో ఉపరాష్ట్రపతి పర్యటన

- ఏర్పాట్లను ఆరా తీసిన సిఎస్ రామకృష్ణారావు



భారత ఉప రాష్ట్రపతి సి.పీ. రాధాకృష్ణన్ హైదరాబాద్ లో ఈనెల 20 ,21 తేదీల్లో పర్యటించనున్నారు. డిసెంబర్ 20 వ తేదీన శంషాబాద్ ఎయిర్ పోర్ట్ కు చేరుకొని అక్కడ నుండి నేరుగా రామోజీ ఫిలిం సిటీ కి వెళ్తారు.

## ఆధార్ డేటా సురక్షితం

### పార్లమెంటులో కేంద్రమంత్రి వెల్లడి



న్యూఢిల్లీ, డిసెంబర్ 17: భారత విశిష్ట గుర్తింపు ప్రాధికార సంస్థ డేటా బేస్ నుంచి ఆధార్‌కార్డు హోల్డర్ల డేటా దుర్వినియోగం జరగలేదని కేంద్రం స్పష్టంచేసింది. ఆధార్ డేటా బదిలీ, స్టోరేజీ సమయంలో అధునాతన ఎన్‌క్రిప్షన్ టెక్నాలజీని వినియో గిస్తున్నట్లు మంత్రి వెల్లడించారు.

## ఢిల్లీలోనే సిఎం రేవంత్ మకాం




- అక్కడే ఉండడంతో రాజకీయంగా చర్చలు

ఫుట్‌బాల్ స్టార్ మెస్సీ హైదరాబాద్ టూర్ ముగిసిన వెంటనే సీఎం రేవంత్‌రెడ్డి ఢిల్లీ పర్యటనకు వెళ్ళిపోయారు.

## పల్లె ప్రజల్లో కెసిఆర్ సిఎం కావాలన్న ఆకాంక్ష

- సర్పంచ్ ఎన్నికల ఫలితాలే నిదర్శనం: హరీష్ రావు



సిద్దిపేట,డిసెంబర్ 17:కేసీఆర్ సీఎం కావాలని.. బీఆర్ఎస్ మళ్లీ రావాలని ప్లలె ప్రజలు తీర్పునిచ్చారని మాజీ మంత్రి హరీశ్‌రావు అన్నారు. కాంగ్రెస్, బీజేపీ పార్టీలు ప్రజల్లో విశ్వసనీయత కోల్పోయాని తెలిపారు. సిద్దిపేట జిల్లా నాంచారుపల్లి బీజేపీ సర్పంచ్ నరసింహారెడ్డి ఇవాళ బీఆర్ఎస్‌లో చేరారు. ఆయనకు హరీశ్‌రావు గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. పెద్ద కోడూరుకు చెందిన కాంగ్రెస్, బీజేపీ నాయకులు కూడా బీఆర్ఎస్‌లో చేరారు.ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ.. నమ్మకానికి, విశ్వాసానికి ప్రతీక కేసీఆర్, బీఆర్ఎస్ పార్టీ అని తెలిపారు. కాంగ్రెస్, బీజేపీ కపట నాటకాలకు సర్పంచ్ ఎన్నికల్లో ప్రజలు కర్రుకాల్చి వాతపెట్టారని అన్నారు. బీజేపీది సబ్‌కా సాత్ సబ్‌కా వికాస్ కాదు.. అది సబ్‌కా బక్వాస్ అని ఎద్దేవా చేశారు. రేవంత్ రెడ్డి చీఫ్ మినిస్టర్ కాదు.. పేదల పథకాలకు ఎసరుపెట్టే కటింగ్ మాస్టర్ అని విమర్శించారు. మహిళలకు రూ.55 వేలు, వృద్ధులకు రూ.44 వేలు కాంగ్రెస్ ప్రభుత్వం బాకీ పడిందని తెలిపారు. సిద్దిపేట జిల్లాలో కాంగ్రెస్, బీజేపీలకు ప్రజలు ఓటుతో బుద్ధి చెప్పారని అన్నారు.

# మీ ప్రజాస్వామ్య ప్రయాణం అభినందనీయం

- సింహాల గడ్డపై అడుగిడడం...సొంత గడ్డపై ఉన్నట్లుంది
- ఇథియోపియా పార్లమెంటులో మోడీ ప్రసంగం



ఇథియోపియా పర్యటనలో ఉన్న భారత ప్రధాని నరేంద్ర మోదీ.. ఆ దేశ పార్లమెంట్ సంయుక్త సమావేశంలో ప్రసంగిస్తూ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. సింహాల దేశంలో అడుగుపెట్టడం పట్ల తన సొంత గడ్డపైనే ఉందన్న భావన కలుగుతోందన్నారు. తన స్వస్థలమైన గుజరాత్ కూడా సింహాలకు నిలయం కావడమే ఇందుకు కారణమని మోదీ పేర్కొన్నారు. ప్రధాని మోదీ ప్రసంగించిన పార్లమెంట్లలో ఇది 18వది కావడం విశేషం.

## మాయ చేస్తోన్న బంగారం...వెండి



– వివరాలు 2లో

## కాంగ్రెస్, బిఆర్ఎస్ వర్గాల ఘర్షణ



## రాజేంద్రనగర్‌లో హైకోర్టు భవన నిర్మాణం




- పనుల పురోగతిని పరిశీలించిన స్పెషల్ చీఫ్ సెక్రటరీ

## జర్మనీలో రాహుల్ పర్యటన



## కేంద్ర పథకాలపై దృష్టి పెట్టండి

- ప్రాయోజిత పథకాల్లో వెనకబాటు సరికాదు
- నిధులను సకాలంలో వినియోగించాలి
- అధికారులు, మంత్రులకు సిఎం చంద్రబాబు దిశానిర్దేశం



“సీఎస్ఎస్ పథకాల ద్వారా రూ. 24,513 కోట్ల విలువైన పనులు పూర్తి చేయాల్సి ఉండగా.. ఇంకా రూ. 6,252 కోట్ల నిధులు ఖర్చు పెట్టలేదు. ప్రభుత్వ శాఖలు కేంద్ర ప్రాయోజిత పథకాలను వినియోగించుకోవటంలో ఎందుకు వెనుకపడుతున్నాయని ప్రశ్నించారు.”

అమరావతి,డిసెంబర్ 17:కేంద్ర ప్రాయోజిత పథకాలు, నిధుల వినియోగంపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు బుధవారం నాడు సమీక్ష జరిపారు. కొన్ని శాఖలు, కొన్ని జిల్లాల్లో కేంద్ర ప్రభుత్వ నిధులను పూర్తిస్థాయిలో వినియోగించకపోవడం సరికాదని సీఎం చంద్రబాబు కలెక్టర్ల సదస్సులో అన్నారు. ఖర్చు పెట్టకుండా మిగిలిపోయిన కేంద్ర నిధులను జనవరి 15వ తేదీ నాటికి ఖర్చు పెట్టాలని అధికారులకు సీఎం సూచించారు.

రోజురోజుకూ రూపాయి పతనం ఆందోళన కలిగిస్తోంది. అదేపనిగా దిగుమతులు పెంచుకోవడం, ఎగుమతులు తగ్గడం వంటి కారాణాలకు తోడు అంతర్జీతాయ పరిణామాల నేపథ్యంలో రూపాయి దిగజారుతోంది. ప్రపంచ మార్కెట్లో మన వస్తువుల ఉ త్పత్తులు పెరిగితేనే మన విదేశీ మారక నిల్వలు పెరగడంతో పాటు, రూపాయి బలపడగలదు. అయితే గత దశాబ్దకాలంతో పోలిస్తే రూ-పాయి విలువ వందశాతం పడిపోయింది. ఇప్పుడు డాలర్‌తో పోలిస్తే 91 రూపాయలకు చేరింది. ఇది మనకు గుదిబండగా మారినా పెద్దగా స్పందన రావడం లేదు. ఆర్థికవేత్తలు, ప్రభుత్వం దీనిపై సీరియస్‌గా దృష్టి సారించడం లేదా అన్న అనుమానాలు వస్తున్నాయి. ఫారెక్స్ మార్కెట్లో రూపాయి యథేచ్ఛగా దిగజారుతూనే ఉంది. మంగళవారం డాలర్ మారకంలో రూపాయి విలువ మరో 15 పైసలు క్షీణించి ఆల్‌టైమ్ కనిష్ఠ స్థాయి 90.93 వద్ద స్థిరపడింది. అంతకు ముందు ఇంట్రాడేలో 36 పైసలు క్షీణించి జీవితకాల కనిష్ఠ స్థాయి 91.14 వరకు కూడా దిగజారింది. కేవలం 10 ట్రేడింగ్ సెషన్లలోనే డాలర్ మారకం లో రూపాయి 90 నుంచి 91 స్థాయికి పడిపోయింది. కేవలం ఐదు సెషన్లలోనే 1 శాతం మేరకు నష్టపోయింది. డాలర్ బలహీనత, క్రూడాయిల్ ధరల తగ్గుదల సైతం రూపాయి పతనాన్ని నిలువరించలేకపోయాయి. బ్రెంట్ క్రూడాయిల్ బ్యారెల్ ధర 1.54 శాతం దిగజారి 59.63 డాలర్లకు దిగివచ్చింది. ప్రస్తుత పరిస్థితుల్లో ఈ నెలలోనే రూపాయి 92 కన్నా దిగజారవచ్చని ఫారెక్స్ ట్రేడర్లు అంచనా వేస్తున్నారు. అమెరికాతో వాణిజ్య ఒప్పందానికి భారత్ చేసిన కొత్త ప్రతిపాదనలను స్వీకరించేందుకు అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అంగీకరించలేదన్న వార్తలు రూపాయి మారకాన్ని ప్రభావితం చేశాయని ఫారెక్స్ ట్రేడర్లంటున్నారు. సరికొత్త ప్రతిపాదనలను భారత్ ఖరారు చేసే వరకు డీల్ నిలిచిపోయినట్టే అన్న భయాలు సెంటిమెంట్‌ను దెబ్బతీశా యి. మరోపక్క రూపాయి పతనాన్ని నిలువరించేందుకు ఆర్‌బీఐ జోక్యం చేసుకోకపోవడం వల్ల విదేశీ పోర్ట్‌ఫోలియో ఇన్వెస్టర్లు నిధులు ఉపసంహరించడం మూలిగే నక్కపై తాటిపండు పడ్డట్టయింది.ఇదిలా ఉండగా 2027 జూన్ నాటికి రూపాయి 92-94 స్థాయికి దిగజారవచ్చని యాక్సిస్ బ్యాంక్ చీఫ్ ఎకనామిస్ట్ నీలకంఠ్ మిశ్రా అంచనా వేస్తున్నారు. అయితే రూ-పాయి ఎంత దిగజారినా మనం భయపడాల్సిందేమీ లేదన్నది ఆయన అభిప్రాయంగా ఉంది. మనం 68,500-69,000 కోట్ల డాలర్ల భారీ విదేశీ మారకపు నిల్వలతో అత్యంత శక్తివంతంగా ఉ న్నామని ఆయన అన్నారు. ఈ ఏడాది డిసెంబరు 3వ తేదీ వరకు రూపాయి విలువ 5.1 క్షీణించిందని కేంద్రమంత్రి పంకజ్ వెల్లడించారు. రూపాయి విలువ ఇంతగా పడిపోవడానికి వాణిజ్య లోటే కారణమని ప్రభుత్వం చెబుతోంది. రూపాయి నిరంతర పతనం అంశాన్ని కొందరు సభ్యులు రాజ్యసభలో ప్రస్తావించగా ఆర్థిక శాఖ సహాయ మంత్రి పంకజ్ చౌదురి ఈ ప్రకటన చేశారు. ఈ ఏడాది రూపాయి విలువను వాణిజ్య లోటు, అమెరికాతో వాణిజ్య ఒప్పందం ప్రభావితం చేశాయని మంత్రి చెప్పారు. రూపాయి విలువ క్షీణత వల్ల ఎగుమతి రంగం పోటీ సామర్థ్యం పెరుగుతుందని ఆయన అన్నారు. ఇదే సమయంలో దిగుమతుల విలువ పెరగవచ్చని కూడా ఆయన అంగీకరించారు. రూపాయి విలువను మార్కెట్ నిర్ణయిస్తుందని, దానికి ఎలాంటి లక్ష్యాన్ని నిర్దేశించలేదని మంత్రి స్పష్టం చేశారు. అయితే రూపాయి కదలికలను ఆర్‌బీఐ నిరంతరం ట్రాక్ చేస్తున్నదని, ఆటుపోట్లు తీవ్రంగా ఉంటే అవసరమైన మేరకు జోక్యం చేసుకుంటుందని ఆయన చెప్పారు. అయితే డాలర్‌తో పోలిస్తే రూపాయి మారకపు విలువ మరింత క్షీణించే అవకాశం ఉ ందని, అయితే దీనిపై ఆందోళన చెందాల్సిన అవసరం లేదని కొందరు వాదిస్తున్నారు. ఫార్వర్డ్స్ మార్కెట్‌లో ఆర్‌బీఐ జోక్యం వల్ల సమస్య వస్తోందని, ఇంతకు ముందు రూపాయిని ఒక స్థాయికి కట్టడి చేయడం ఒక తప్పిదమని పేర్కొన్నారు. గతంలో చేసిన తప్పిదాలు ఇప్పటికీ వెంటాడుతున్నాయని తెలిపారు. ఇకపోతే ఇటీవలి కాలంలో అమెరికా తనకు గిట్టని దేశాలపై డాలర్‌తో బాదుతోంది. రష్యా, ఇరాన్, వెనెజువెలా దేశాలపై ఆర్థిక ఆంక్షలు విధించింది. డాలర్లు చిక్కకుండా చేసి, వాటి వ్యాపారాన్ని దెబ్బతీసింది. ఆ దేశాలను ప్రపంచ వాణిజ్యం నుంచి బయటికి పంపడానికి ఇదంతా చేసింది. రేపు తమకూ ఇలాంటి పరిస్థితే తలెత్తితే ఎలాగని ఇతర దేశాల్లో ఆందోళనతో కూడిన అనుమానం మొదలైంది. ఫలితంగా, డాలర్ మీద ఆధారపడటం తగ్గించి కొత్త మార్గాల్లో వాణిజ్యం చేసే ప్రయత్నం ఊపందుకొంటోంది. రష్యా కూడా చైనా, భారత్, కొన్ని ఆఫ్రికన్ దేశాల కరెన్సీలు, రూబుళ్లలో వ్యాపారం చేస్తోంది. భారత్ 30 దేశాలతో రూపాయితో జమలు, చెల్లింపులకు ఖాతాలు తెరచింది. అయితే రష్యాకు భారత్ చేసే ఎగుమతులకన్నా దిగుమతులే ఎక్కువ కావడంతో మన రూపాయలు రష్యన్ బ్యాంకుల్లో పేరుకుపోతున్నాయి. రష్యా భారత్ నుంచి ఎక్కువ దిగుమతులు చేసుకుంటే అవి ఖర్చయ్యేవి. కాకపోతే, ఆ రూపా-యలతో భారత్‌లో పెట్టుబడులు పెట్టే అవకాశం ఉండటంతో, ఆ దిశగా ప్రయత్నాలు జరుగుతున్నాయి. భారత్ ఇతర దేశాలతో రూ-పాయలు, స్థానిక కరెన్సీల్లో వ్యాపారం మొదలుపెట్టింది. సింగపూర్, యుఏఈ, నేపాల్, భూటాన్‌లలో యూపీఐ చెల్లింపులు ఊపందుకుంటున్నాయి. ఒక్కసారిగా డాలర్లకు దూరం జరిగితే చమురు, ఇతర దిగుమతుల ధరలు పెరిగిపోయి సామాన్యులు ద్రవ్యోల్బణం బారిన పడతారు. అందుకే డాలర్ ఆధిపత్యాన్ని క్రమక్రమంగా వదిలించుకోవాలని ప్రపంచ దేశాలు చూస్తున్నాయి. ఈ క్రమంలో భారత్ కూడా బలమైన వాణిజ్యం దిశగా అడుగులు వేయాల్సి ఉంది. అంతకుముందే రూపాయిని బలోపేతం చేసుకుంటే మంచిది. ప్రపంచంలో ఇప్పటికీ 47శాతం లావాదేవీలకు డాలర్లనే ఉపయోగిస్తున్నారు. అందుకని, మరికొంత కాలం డాలర్ ఆధిపత్యం కొనసాగవచ్చు. ఆ తరవాత కూడా డాలర్ స్థానాన్ని ఏ ఒక్క దేశ కరెన్సీ ఆక్రమించకపోవచ్చు. స్థానిక కరెన్సీలు, డిజిటల్ కరెన్సీలు, బంగారం వాడకం పెరగవచ్చు.

మూడు విడతల పంచాయతీ ఎన్నికలు ముగిశా-యి.పంచాయతీ ఎన్నికల మూడో దశ పోలింగ్ నేపథ్యంలో పలు చోట్ల ఘర్షణలు చోటుచేసుకున్నాయి. ఓటర్లు ఉదయం నుంచే పోలింగ్ కేంద్రాలకు తరలి వచ్చారు. గ్రామాల్లో ఎన్నికలను ప్రతిష్టాత్మకంగా తీసుకున్నారు. ఇతర ప్రాంతాల్లో ఉన్న ఓటర్లను రానుపోను కిరాయి డబ్బులు ఇచ్చి రప్పించారు.ఉదయం 7గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు పోలింగ్ కొనసాగింది. మధ్యాహ్నం ఒంటి గంట వరకు క్యూలో నిల్చున్న వారికి ఓటేసేందుకు అవకాశం కల్పించారు. కాగా, మొదటి, రెండో విడతల ఎన్నికల మాదిరిగానే మూడో విడత తెలంగాణ సర్పంచ్ ఎన్నికల్లో అధికార కాంగ్రెస్ పార్టీకి బీఆర్ఎస్ గట్టి పోటీనిచ్చింది. బుధవారం మూడవ విడతలో భాగంగా 3,752 గ్రామ పంచాయతీలకు, 28,410 వార్డులకు పోలింగ్ జరిగింది. ఈ విడతలో సుమారు 53 లక్షల మంది ఓటర్లు తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. మధ్యాహ్నం 1 గంట ప్రాంతంలో పోలింగ్ ముగిసింది. 2 గంటల నుంచి ఓట్ల లెక్కింపు చేపట్టారు. రాష్ట్ర వ్యాప్తంగా గ్రామపంచాయతీ ఎన్నికలు చెదురుమదురు ఘటనలు మినహా ప్రశాంతంగా కొనసాగాయి. వికారాబాద్, రంగారెడ్డి జిల్లాల్లో స్వల్ప ఉద్రిక్తత నెలకొన్నది. పోలింగ్ బూత్‌లో ప్రచారం చేస్తున్నారంటూ కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలకు చెందిన పోలింగ్ ఏజెంట్లు పరస్పరం దాడులు చేసుకున్నారు. వికారాబాద్ జిల్లా పరిగి మండలం మాదారం పోలింగ్ కేంద్రం వద్ద బీఆర్ఎస్ పోలింగ్ ఏజెంట్లపై కాంగ్రెస్ పార్టీకి చెందినవారు దాడికి పాల్పడ్డారు. తమకు ఓట్లు వేయాలంటూ కాంగ్రెస్ ఏజెంట్లు పోలింగ్ బూత్‌లో ప్రచారం నిర్వహిస్తుండటంతో బీఆర్ఎస్ ఏజెంట్లు వారిని అడ్డుకున్నారు. దీంతో ఇరు వర్గాలు ఒకరిని ఒకరు తోసుకున్నారు. దీంతో నలుగురు గాయపడ్డారు. ఇరువర్గాలను చెదరగొట్టిన పోలీసులు.. గాయపడిన వారిని పరిగి ప్రభుత్వ దవాఖానకు తరలించారు. ఇక రంగారెడ్డి జిల్లా మంచాల మండలం అస్మత్‌పూర్‌లో ఉద్రిక్తత నెలకొన్నది. కాంగ్రెస్ అభ్యర్థి పోలింగ్ బూత్‌లో



ప్రచారం నిర్వహిస్తున్నాడని బీఆర్ఎస్ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో బీఆర్ఎస్, కాంగ్రెస్ నాయకుల మధ్య ఘర్షణ చోటుచేసుకుంది. రెండు పార్టీల కార్యకర్తలు పర-స్పరం దాడులు చేసుకున్నారు. దీంతో సర్పంచ్ అభ్యర్థి సహా పలువురు గాయపడ్డారు.పరిగి ఎమ్మెల్యే టీ. రామ్మోహన్ రెడ్డి ఏకంగా పోలింగ్ కేంద్రం వద్ద కుర్చీ వేసుకు కూర్చున్నారు. ఓటర్లను ప్రభావితం చేస్తున్నారు. ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి తన సొంత గ్రామం దోమ మండలంలోని శివారెడ్డిపల్లిలో ఓటు హక్కు వినియోగించుకున్నారు. అయితే మొదటి రెండు దశల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యేల స్వగ్రామాల్లో ఓటమిని ఎదురుచూశారు. అలా తనకు కూడా కావొద్దని అనుకున్నారో ఏమో.. ఏకంగా పోలింగ్ కేంద్రం వద్ద కుర్చీ వేసుకుని కూర్చుకున్నారు. ఓటేయడానికి వెళ్లే వారిని కాంగ్రెస్ అభ్యర్థికి ఓటు వేయాలంటూ విజ్ఞప్తి చేసారు. ఎన్నికల నియమావలికి వ్యతిరేకంగా ఎమ్మెల్యే పోలింగ్ కేంద్రం వద్ద కూర్చున్నప్పటికీ అధికారులు పట్టించుకోవడం లేదని బీఆర్ఎస్ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేసారు. సొంత ఊరిలో ఓడిపోతే పరువుపోతుందనే ఉద్దేశంతోనే ఆయన ఇలా వ్యవహరిస్తున్నారని విమర్శి స్తున్నారు.

# అసెంబ్లీ సాక్షిగా ప్రజాస్వామ్యం ఖూనీ

- **ఫిరాయింపు ఎమ్మెల్యల తీర్పుపై కెటిఆర్**
- **రాజ్యాంగాన్ని తుంగలో తొక్కారన్న హరీష్ రావు**





హైదరాబాద్, డిసెంబర్ 17 : ఐదుగురు ఫిరాయింపు ఎమ్మెల్యేలపై స్పీకర్ గడ్డం ప్రసాద్ ఇచ్చిన తీర్పును బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రంగా ఖండించారు. అసెంబ్లీ సాక్షిగా ఇవాళ ప్రజాస్వామ్యాన్ని కాంగ్రెస్ పార్టీ నిలువునా ఖూనీ చేసిందని విమర్శించారు. దేశ అత్యున్నత న్యాయస్థానాల పైనే కాదు.. చివరికి రాజ్యాంగంపై కూడా రాహుల్ గాంధీకి ఏమాత్రం గౌరవం లేదని మరోసారి తేలిపోయిందని అన్నారు.బీఆర్ఎస్ ఎమ్మెల్యేల ఇంటికి వెళ్లి మరీ సీఎం రేవంత్ పార్టీ ఫిరాయింపులకు తెరతీసిన నాటి నుంచి నేటి స్పీకర్ నిర్ణయం వరకూ కాంగ్రెస్ పార్టీ రాజ్యాంగాన్ని అడుగడుగునా అపహాస్యం చేస్తూనే ఉందని కేటీఆర్ విమర్శించారు. అభివృద్ధి కోసం పార్టీ మారినట్టు సాక్షాత్తు ఫిరాయింపు ఎమ్మెల్యేలే అనేక సార్లు ప్రకటించినా వారిని కాపాడటం రాహుల్ రెండు నాల్కల ధోరణికి నిదర్శనమని అన్నారు. కేవలం ఫోటోలకు ఫోజులిచ్చేందుకు చేతిలో రాజ్యాంగాన్ని పట్టుకుని తిరిగితే సరిపోదని.. తండ్రి చేసిన చట్టాన్నే గౌరవించలేని అసమర్థ నాయకుడిగా రాహుల్ గాంధీ చరిత్రలో మిగిలిపోతారని ధ్వజమెత్తారు. సీఎం రేవంత్ రెండేళ్ల పాలనా వైఫల్యాలపై పంచాయతీ ఎన్నికల్లో పల్లెపల్లెనా వెల్లువెత్తుతున్న ప్రజావ్యతిరేకతకు భయపడే కాంగ్రెస్ పార్టీ బై ఎలక్షన్స్ అంటే జంకుతోందని కేటీఆర్ అన్నారు. ఫిరాయింపు ఎమ్మెల్యేలపై చర్య తీసుకోకుండా వెనకడుగు వేయడానికి ప్రధాన కారణం ఇదేనని తెలంగాణ సమాజానికి స్పష్టంగా అర్థమై పోయిందని విమర్శించారు. గోడ దూకిన బిఆర్ఎస్ ఎమ్మెల్యేలను తాత్కాలికంగా కాపాడి నట్టు కాంగ్రెస్ అనుకున్నా. ప్రజాక్షేత్రంలో వారిని ఎమ్మెల్యే పదవికి అనర్హులుగా ఆయా నియోజ కవర్గాల ప్రజలు ఎప్పుడో ప్రకటించేశారని తెలిపారు. ఈ వ్యవహారంపై మాజీ మంత్రి హరీశ్‌రావు ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలంగాణలో రాజ్యాంగాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం తుంగలో తొక్కారని ఆరోపించారు. సేవ్ ది కానిస్టిట్యూషన్ అంటూ రాహుల్ గాంధీ ఢిల్లీలో ఉపన్యాసాలు ఇస్తారని.. కానీ ఆచరణలో మాత్రం ఆ నినాదం మాటలకే పరిమితమైందని ఆరోపిం చారు. ఆచరణలో రాజ్యాంగాన్ని తుంగలో తొక్కుతున్న కాంగ్రెస్ ప్రభుత్వ వైఖరిని ప్రజలు స్పష్టంగా గమనిస్తున్నారని చెప్పారు. ప్రజాస్వామ్య సూత్రాలను తీవ్రంగా దెబ్బతీసిన ఈ ఘటనలో కాంగ్రెస్ ప్రభుత్వం రాజ్యాంగ ఉల్లంఘనకు పాల్పడింది. పార్టీ మారిన ఎమ్మెల్యేల విషయంలో రాజ్యాంగం స్పష్టంగా నిర్దేశిరచిన యాంటీ-డిఫెక్షన్ నియమాలను పూర్తిగా పక్కన పెట్టి.. అధికార పార్టీకి అనుకూలంగా నిర్ణయం తీసుకో వడం. ఇది రాజ్యాంగాన్ని కాలరాయడమే. ఇది ఎంతో సిగ్గుచేటు. ప్రజాస్వామ్యానికి చెరగని మచ్చ అని అన్నారు. స్పీకర్ తీసుకున్న నిర్ణయం ప్రజాస్వామ్యానికి గొడ్డలి పెట్టు అని మాజీ ఎంపి వినోద్ కుమార్ అన్నారు. స్వయంగా ఎమ్మెల్యేలు నియోజకవర్గంలో అభివృద్ధి కోసం పార్టీ మారినట్లు చెప్పారు. కానీ ఇవాళ స్పీకర్ మాత్రం పార్టీ మారలేదు అని చెప్పడం ఎంత వరకు కరెక్ట్. 10వ షెడ్యూల్‌లో రాజ్యాంగ సవరణ చేయాలి. పార్లమెంట్‌లో వెంటనే పార్టీ ఫిరాయింపులపై ప్రత్యేక చట్టం చేయాలని డిమాండ్ చేశారు.

# రాజేంద్రనగర్‌లో హైకోర్టు భవన నిర్మాణం

- **పనుల పురోగతిని పరిశీలించిన స్పెషల్ చీఫ్ సెక్రటరీ**



హైదరాబాద్,డిసెంబర్ 17: రాష్ట్ర ప్రభుత్వం రాజేంద్రనగర్‌లో ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న నూతన హైకోర్టు భవన నిర్మాణ పనులను రోడ్లు మరియు భవనాల శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ వికాస్ రాజ్ బుధవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ పర్యటనలో ఆయనతో పాటు ఆర్ అండ్ బి చీఫ్ ఇంజనీర్లు రాజేశ్వర్ రెడ్డి, లింగారెడ్డి క్షేత్రస్థాయి ఇంజనీర్లు, కాంట్రాక్ట్ సంస్థ ప్రతినిధులు మరియు కన్‌స్టలెంట్లు పాల్గొన్నారు. పనుల పురోగతిని సమీక్షించిన అనంతరం, స్పెషల్ చీఫ్ సెక్రటరీ సంబంధిత అధికారులకు మరియు సంస్థలకు కీలక ఆదేశాలను జారీ చేశా-ారు. సుమారు రూ. 2583.00 కోట్లు వ్యయంతో 36.52 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో నిర్మిస్తున్న హైకోర్టు భవనం రాష్ట్ర ఐకానిక్ బిల్డింగ్ లా ఉండాలని, అధికారులు అందుకు తగ్గట్టుగా మనసు పెట్టి పనిచేయాలని ఇప్పటికే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశించిన విషయాన్ని ఈ సందర్భంగా గుర్తు చేశారు. పనుల్లో జాప్యం కలగకుండా ఉండటానికి, కన్‌స్టలెంట్లు డ్రాయింగ్ షెడ్యూల్‌ను ముందుగానే అందించాలి. దీనివల్ల కాంట్రాక్ట్ సంస్థ అవసరమైన సిబ్బందిని, యంత్రాలను మరియు సామగ్రిని సిద్ధం చేసుకోవడానికి వీలవుతుంది. కుదుర్చుకున్న ఒప్పందం ప్రకారం నిర్ణీత గడువులోగా పనులను పూర్తి చేయాలని కాంట్రాక్ట్ సంస్థను ఆదేశించారు.'నుల పురోగతిపై శాఖా పరమైన అధికారులు కన్‌స్టలెంట్ మరియు కాంట్రాక్టర్‌తో తరచుగా సమీక్షా సమావేశాలు నిర్వహించాలని సూచించారు. జ్యుడీషియల్ అధికారుల సూచనల మేరకు సవరించిన ఎ÷-లాన్లను వెంటనే సిద్ధం చేసి అనుమతులు తీసుకోవాలని కన్‌స్టలెంట్లను ఆదేశించారు. అలాగే, జోన్ 2కి సంబంధించిన అటవీ శాఖ అనుమతులను త్వరితగతిన పూర్తి చేయాలని స్పెషల్ సిఎస్ వికాస్ రాజ్ చీఫ్ ఇంజనీర్‌కు సూచించారు.

# భూపాలపల్లిలో కూలిన చెక్ డ్యామ్

జయశంకర్ భూపాలపల్లి,డిసెంబర్ 17: మల్హర్ రావు మండలం పల్లెకుంట గ్రామ పరిసరాల్లో మానేరుపై నిర్మించిన చెక్ డ్యాం కొద్దిమేర కూలిపోయింది. 10 మీటర్ల మేర చెక్ డ్యాం గోడ కూలింది. ఫలితంగా నీరంతా దిగువకు వృథాగా పోతోంది. ఘటన జరిగిన సమయంలో చేపలు పడుతున్న ఇద్దరు మత్స్యకారులు ప్రవాహ ఉధృతికి కొద్దిదూరం కొట్టుకుపోయారు. తర్వాత ఈదుకుంటూ ఒడ్డుకు చేరడంతో వారికి ప్రాణాపాయం తప్పింది.

# 20,21 తేదీల్లో రెండ్రోజులు ఉపరాష్ట్రపతి పర్యటన

**ఏర్పాట్లను ఆరా తీసిన సిఎస్ రామకృష్ణారావు**

హైదరాబాద్,డిసెంబర్ 17: భారత ఉప రాష్ట్రపతి సి.పీ. రాధాకృష్ణన్ హైదరాబాద్ లో ఈనెల 20 ,21 తేదీల్లో పర్యటించనున్నారు. డిసెంబర్ 20 వ తేదీన శంషాబాద్ ఎయిర్ పోర్ట్ కు చేరుకొని అక్కడ నుండి నేరుగా రామోజీ ఫిలిం సిటీ కి వెళ్తారు. పబ్లిక్ సర్వీస్ కమీషన్ చైర్మన్ ల జాతీయ సదస్సు ముగింపు కార్యక్రమంలో పాల్గొని అక్కడ నుండి లోక్ భవన్ లో రాత్రి బస చేస్తారు. 21 వ తేదీ ఉదయం కన్హా శాంతి వనంలో ఏర్పాటు చేసిన ప్రపంచ



ధ్యాన దినోత్సవం కార్యక్రమంలో పాల్గొని అక్కడి నుండి శంషాబాద్ ఎయిర్ పోర్ట్‌కు చేరుకొని న్యూఢిల్లీ తిరిగి వెళ్తారు. ఉప రాష్ట్రపతి పర్యటన ఏర్పాట్లపై రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణా రావు సంబంధిత ఉన్నతాధికారులతో టెలీ కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. బందోబస్తు ఏర్పాట్లు, ఉప రాష్ట్రపతి ప్రయాణించే మార్గంలో రహదారుల నిర్వహణ, ప్రోటోకాల్ తదితర ఏర్పాట్లపై సమీక్షించారు. ఉప రాష్ట్ర పతి పర్యటనకు ఏ విధమైన లోటు జరగకుండా పకడ్బందీ చర్యలు చేపట్టాలని ఆదేశించారు.

అమరావతి,డిసెంబర్17(ఆర్ఎన్ఎ): వ్యవసాయం, ఇండస్ట్రీ, సర్వీస్ సెక్టార్లలో సాధించిన త్రైమాసిక ఫలితాలపై పరీక్షలు రాసిన విద్యార్థిలా ఎదురు చూస్తానని.. దీనికి అనుగుణంగానే అధికారులు పని చేయాలని, లక్ష్యాలను చేరుకోవాలని సిఎం చంద్రబాబు కలెక్టర్లకు సూచనలు చేశారు. గడిచిన రెండు త్రైమాసికాల్లో మెరుగైన ఫలితాలను సాధించగలిగామన్నారు. ఈసారి వృద్ధి లక్ష్యాన్ని 17.11 శాతంగా పెట్టుకున్నామని.. మొత్తం 17 వర్టికల్స్‌లో ఫలితాలు సాధిస్తేనే జీఎస్డీపీ పెరుగుతుందని చెప్పారు. ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన 5వ కలెక్టర్ల సమావేశం కొనసాగుతోంది. వివిధ శాఖల పనితీరుపై సీఎం సమీక్ష నిర్వహించారు. ఆయా శాఖలకు చెందిన ప్రగతిపై ఉన్నతాధికారులు ప్రజంటేషన్లు ఇచ్చారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ..లైవ్ స్టాక్, మాన్యుఫాక్చరింగ్, ఫిషింగ్ సహా వేర్వేరు రంగాల్లో ఈ ప్రగతిని సాధించాలని కలెక్టర్లకు తెలియజేశారు. వ్యవసాయ రంగం ఎప్పుడూ డిమాండ్ డ్రివెన్‌గా ఉండాలన్నారు. జీఎస్డీపీ సాధనలో ప్రణాళిక అత్యంత కీలకమని... జిల్లా స్థాయిలో పక్కా ప్రణాళికలను రూపొందించుకోవాలని సూచించారు. అందుకే అభివృద్ధి వికేంద్రీకరణ ద్వారా కొన్ని ప్రాంతాలకు చేయూత ఇస్తున్నామని చెప్పారు. ప్రతీ యూనిట్, ప్రతీ శాఖలో సామర్థ్యాలను పెంచేందుకు ప్రయత్నిస్తున్నా మన్నారు. వచ్చే కలెక్టర్ల సదస్సుకు ప్రగతిలో, కలెక్టర్లు, ఉన్నతాధికారుల పనితీరులో క్వాంటం ఇంప్రూవ్మెంట్ కనిపించాలని తెలిపారు. పశుగ్రాసం పెంచే అంశంపై డ్వాక్రా మహిళలను భాగస్వామ్యం చేయలని అన్నారు. గతంలో తెలంగాణతో పోటా పోటీగా ఉండేవాళ్లమని.. గత ప్రభుత్వం అవలంభించిన తప్పుడు విధానాల వల్ల ఏపీ దక్షిణ భారతదేశంలో చివరి స్థానానికి చేరిందన్నారు. దీన్ని తిరిగి గేరప్ చేయాలని.. అగ్ర స్థానానికి చేరాలని చెప్పుకొచ్చారు. 2024 తర్వాత జీఎస్డీపీ కాస్తంత మెరుగైందన్నారు. వ్యవసాయ రంగంపై బాగా



ఫోకస్ పెట్టాలని తెలిపారు. వ్యవసాయ రంగంలో ఎంత చేస్తున్నా... ఇంకా మిగిలే ఉంటుందని అన్నారు. మార్కెటింగ్ ఇంటెలిజెన్స్ బలోపేతం చేయాలని సీఎం తెలిపారు. జాతీయ, అంతర్జాతీయ మార్కెట్లకు మన ఉత్పత్తులను పంపేలా చేయగలిగితే వ్యవసాయ రంగం సుస్థిరత సాధిస్తుందని చెప్పారు. అంతర్జాతీయ స్థాయిలో వ్యవసాయ, ఉద్యాన ఉత్పత్తులను ఎగుమతి చేసే స్థాయిలో పంటలు పండించాలని అన్నారు. ఉద్యాన రంగంలో కూడా భారీ ఎత్తున పెట్టుబడులు రావాల్సిన అవసరం ఉందని సీఎం వెల్లడించారు. బీ ఖరీఫ్ రబీ మూడు సీజన్లు స్వల్ప కాలిక, ఐదేళ్ల కాలానికి మధ్య, 10 -15 ఏళ్లకు దీర్ఘకాలిక ప్రణాళికల్ని తయారు చేసుకోవాలని ఆదేశించారు. డిమాండ్ డ్రివెన్ పంటలు, వాటర్ సెక్యూరిటీ, ఫుడ్ ప్రాసెసింగ్, అగ్రిటెక్ లాంటి

తీసుకోవాని సమావేశంలో వెల్లడించారు.దేశీయంగా, అంతర్జాతీయ మార్కెట్లకు పంపేలా చర్యలు ఉండాలన్నారు. 60-70 వేల కోట్ల ప్రైవేటు పెట్టుబడులు కూడా ఈ ఉద్యాన పంటల రంగంలో రావాల్సిన అవసరం ఉందని చెప్పారు. నాణ్యమైన ఉత్పత్తులను పండించేలా రైతులకు అవగాహన చైతన్యం కల్పించాలని అన్నారు. సేవల రంగంలో పర్యాటకం కూడా కీలకమని స్పష్టం చేశారు. బాపట్లలోని సూర్యలంక లాంటి బీచ్‌ల వద్ద ప్రముఖ బ్రాండ్లు వచ్చేలా చూడాలని కలెక్టర్లకు సీఎం చంద్రబాబు దిశానిర్దేశర చేశారు. విశాఖ భాగస్వామ్య సదస్సులో చేసుకున్న ఒప్పందాలను గ్రౌండ్ చేసుకునేలా భూ కేటాయింపులు చేసుకోవాలని మంత్రి లోకేష్ అన్నారు. సంబంధిత ప్రభుత్వ శాఖల అధికారులు దీనిపై దృష్టి పెట్టాలన్నారు. ఐటీ, పరిశ్రమలు, ఎంఎస్ఎంఈ మంత్రులంతా దీనిపై ప్రత్యేక దృష్టితో ఉన్నామని మంత్రి లోకేష్ పేర్కొన్నారు.





న్యూఢిల్లీ, డిసెంబర్ 17: ఇథియోపియా ప్రజాస్వామ్య ప్రయాణాన్ని ప్రధాని మోడీ ప్రశంసించారు.140 కోట్ల భారతీయ ప్రజల తరఫున స్నేహపూర్వక సోదరభావ శుభాకాంక్షలు తెలిపారు. ఇరుదేశాల జాతీయ గీతాలు.. ప్రజల్లో మాతృభూమి పట్ల గర్వాన్నీ, దేశభక్తినీ ప్రేరేపిస్తాయని కొనియాడారు. ఇథియోపియా పర్యటనలో ఉన్న భారత ప్రధాని నరేంద్ర మోడీ.. ఆ దేశ పార్లమెంట్ సంయుక్త సమావేశంలో ప్రసంగిస్తూ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. సింహాల దేశంలో అడుగుపెట్టడం పట్ల తన సొంత గడ్డపైనే ఉందన్న భావన కలుగుతోందన్నారు. తన స్వస్థలమైన గుజరాత్ కూడా సింహాలకు నిలయం కావడమే ఇందుకు కారణమని మోడీ పేర్కొన్నారు. ప్రధాని మోడీ ప్రసంగించిన పార్లమెంట్లలో ఇది 18వది కావడం విశేషం.ఈ సందర్భంగా.. భారత జాతీయ గేయమైన 'వందేమాతరం', ఇథియోపియా జాతీయ గేయం రెండూ మాతృభూమిని తల్లిగా సూచిస్తాయని మోడీ అభివర్ణించారు. మన వారసత్వం, సంస్కృతి, ప్రకృతి అందాల పట్ల గర్వపడటమే కాకుండా.. దేశాన్ని పరిరక్షించేందుకు అవి మనల్ని ప్రేరేపిస్తాయని మోడీ పేర్కొన్నారు. తనకు లభించిన ఇథియోపియా అత్యున్నత పౌర పురస్కారాన్ని వినయంతో స్వీకరిస్తున్నట్టు తెలిపారు. భారతీయుల తరఫున ఈ గౌరవాన్ని చేతులు జోడించి దేశ గౌరవాన్ని చాటుకున్నారాయన. ఇరు దేశాల మధ్య సాంస్కృతిక సారూప్యతలను ఈ సందర్భంగా ప్రత్యేకంగా కొనియాడారు. ఇథియోపియాలో అతిపెద్ద విదేశీ పెట్టుబడిదారులలో భారతీయ కంపెనీలూ ఉన్నాయని ప్రధాని మోడీ గుర్తు చేశారు. ఇరు దేశాలూ అభివృద్ధి చెందుతున్న దేశాలు కాబట్టి పరస్పర సహకారం అందించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఈ ద్వైపాక్షిక సంబంధాన్ని వ్యూహాత్మక భాగస్వామ్యంగా వృద్ధి చేయాలని తాము నిర్ణయించుకున్నట్టు పేర్కొన్నారు. ఈ రెండు దేశాలు వాతావరణంతో పాటు స్ఫూర్తినీ పంచుకుంటాయని ఈ సందర్భంగా మోడీ తెలిపారు.

# మహిళా క్రికెటర్ శ్రీచరణికి నగదు ప్రోత్సాహకం

**రూ.2.5 కోట్ల చెక్‌ను అందజేసిన మంత్రి లోకేశ్**

అమరావతి,డిసెంబర్17:మహిళా క్రికెటర్ శ్రీచరణికి రాష్ట్ర ప్రభుత్వం నగదు ప్రోత్సాహకం అందజేసింది. ఇటీవల జరిగిన ఐసీసీ మహిళల వన్డే ప్రపంచకప్‌లో అద్భుత ప్రదర్శన కనబరిచి జట్టు విజయంలో కీలకపాత్ర పోషించిన శ్రీచరణిని ప్రభుత్వం ఘనంగా సత్కరించింది. మంత్రి నారా లోకేష్ రూ.2.5 కోట్ల చెక్‌ను శ్రీచరణికి అందజేశారు. బుధవారం ఉండవల్లి నివాసంలో క్రికెటర్ శ్రీచరణికి మంత్రి లోకేష్ స్వయంగా చెక్‌ను అందించారు. ఆమె ప్రతిభను గుర్తించిన రాష్ట్ర ప్రభుత్వం భారీ ప్రోత్సహకాలు ప్రకటించిన విషయం తెలిసిందే. రూ.2.5 కోట్ల మేర నగదు ప్రోత్సాహంతో పాటు విశాఖలో 500 గజాల విస్తీర్ణం గల ఇంటి స్థలాన్ని సర్కార్ కేటాయించింది. అలాగే డిగ్రీ పూర్తయిన తర్వాత శ్రీచరణికి రాష్ట్ర ప్రభుత్వంలో గ్రూప్-1 హోదా ఉద్యోగం ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించారు. ఈ కార్యక్రమంలో రవాణా,




యువజన క్రీడా శాఖల మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి, శాప్ ఛైర్మన్ అనిమిని రవినాయుడు, క్రీడాశాఖ స్పెషల్ సీఎస్ అజయ్ జైన్, శాప్ ఎండీ భరణి, ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ ట్రెజరర్ డి.శ్రీనివాస్, జాయింట్ సెక్రటరీ బి.విజయ్ కుమార్ పాల్గొన్నారు.

# రియల్టర్ మోసం చేశాడని ఆందోళన

ఏలూరు,డిసెంబర్ 17: పశ్చిమ గోదావరి జిల్లా యలమంచిలి మండలంలో తీవ్ర ఉద్రిక్తత చోటు చేసుకుంది. గుంపర్రులోని కడిమిపుంతలో తుంగ నాగేశ్వర రావు అనే వ్యక్తిని దొంగగా ఆరోపిస్తూ.. ఆయన ఇంటిపై స్థానికులు కొందరు కోడిగుడ్లతో దాడి చేశారు. అంతేకాకుండా.. మైక్ సెట్‌తో పాటలు పాడుతూ నాగేశ్వర రావు ఇంటి ఎదుట అక్కడి యువకులు, మహిళలు బైఠాయించి ఆందోళన చేపట్టారు . ఈ నేపథ్యంలో నాగేశ్వర రావు కోడలైన ఆ గ్రామ సర్పంచ్ అమూల్యతో వాగ్వాదానికి దిగారు. రియల్ ఎస్టేట్ పేరుతో తమను నాగేశ్వర రావు మోసం చేశాడని ఆందోళన చేస్తూ కరపత్రాలను పంపిణీ చేస్తున్నారు.

# ఎఎన్ఆర్ కాలేజీకి నాగార్జున 2కోట్ల విరాళం

విజయవాడ,డిసెంబర్17: ప్రముఖ సినీనటుడు అక్కినేని నాగార్జున బుధవారం కృష్ణా జిల్లా గుడివాడలో ఏఎన్నార్ కళాశాల వజ్రోత్సవ వేడుకల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కళాశాల విద్యార్థుల స్కాలర్‌షిప్‌ల కోసం అక్కినేని కుటుంబం తరుఫున రూ.2 కోట్లను అందజేశారు. నాగార్జున మాట్లాడుతూ మనుషులు శాశ్వతం కాదని, మనం చేసే పనులు శాశ్వతమని అన్నారు. తన తండ్రి అక్కినేని నాగేశ్వరరావు చదువుకోకపోయినా వేల మందికి బంగారు భవిష్యత్‌ను ఇచ్చారని పేర్కొన్నారు. 1959 సంవత్సరంలో రూ.లక్ష విరాళం అందించారని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో నాగార్జున సోదరి నాగసుశీల,మాజీ ఎంపీ యార్లగడ్డ లక్ష్మీప్రసాద్, ఎమ్మెల్యే వెనిగండల్ల రాము,కళాశాల యాజమాన్యం, సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



# ఈశాన్య రాష్ట్రాలపై బంగ్లా నేత ప్రేలాపనలు

## రెచ్చగొట్టే వ్యాఖ్యలపై భారత్ ఆగ్రహం

## బంగ్లా హైకమిషనర్‌కు సమన్లు

న్యూఢిల్లీ, డిసెంబర్ 17:ఈశాన్య రాష్ట్రాలపై బంగ్లాదేశ్ నేషనల్ సిటిజన్ పార్టీ నాయకుడు హస్నాత్ అబ్దుల్లా ఇటీవల రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేయడంపై భారత్ చర్యలకు ఉపక్రమించింది. బంగ్లాను అస్థిరపరిస్తే.. సెవన్ సిస్టర్స్(7 ఈశాన్య రాష్ట్రాలు)ను ముక్కలు చేస్తామని హస్నాత్ అబ్దుల్లా బహిరంగంగా హెచ్చరించారు . ఈ విషయమై ఆ దేశ హైకమిషనర్ మహ్మద్ రియాజ్ హమీదుల్లాకు భారత్ సమన్లు జారీ చేసింది. బంగ్లాదేశ్‌లోని భారత దౌత్య కార్యాలయానికి బెదిరింపులు వచ్చిన నేపథ్యంలో ఈ చర్యలకు ఉపక్రమించింది. ఈ మేరకు భారత విదేశాంగ శాఖ ఓ ప్రకటనలో తెలిపింది. బంగ్లాదేశ్‌లో భద్రతా పరిస్థితులు క్షీణించడంపై హమీదుల్లా ముందు ఆందోళన వ్యక్తం చేసింది భారత విదేశాంగ శాఖ. ఢాకాలోని ఇండియన్ ఎంబసీపై బంగ్లాదేశీయులు బెదిరింపులకు పాల్పడటాన్ని ప్రధానంగా ప్రస్తావించింది. బంగ్లాలో ఇటీవల జరిగిన సంఘటనలకు సంబంధించి ఇండియాపై తప్పుడు కథనాలను పూర్తిగా తిరస్కరిస్తున్నట్టు స్పష్టం చేసింది. ఈ ఘటనలకు సంబంధించి తాత్కాలిక ప్రభుత్వం సమగ్ర దర్యాప్తు నిర్వహించకపోవడం లేదా సరైన ఆధారాలను పంచుకోకపోవడం దురదృష్టకరమని భావిస్తూ అసంతృప్తి వ్యక్తం చేసింది. భారత్.. బంగ్లాదేశ్‌తో సన్నిహిత, స్నేహపూర్వక సంబంధాలను కలిగి ఉందని ఈ సందర్భంగా పునరుద్ఘాటించింది. ఆ దేశంతో శాంతి, స్థిరత్వాన్ని కోరుకుంటున్నామని.. శాంతియుత వాతావరణంలో స్వేచ్ఛగా, న్యాయబద్ధంగా ఎన్నికలు నిర్వహించాలని పిలుపునిచ్చినట్టు గుర్తు చేసింది. తాత్కాలిక ప్రభుత్వం తన దౌత్య బాధ్యతలకనుగుణంగా బంగ్లాలోని భారత మిషన్లు, పోస్టుల భద్రతను నిర్ధారించాలని ఆశిస్తున్నట్టు స్పష్టం చేసింది ఇండియా. కాగా.. గతేడాది విద్యార్థుల ఆందోళన తర్వాత బంగ్లాదేశ్ ప్రధానిగా ఉన్న షేక్ హసీనా రాజీనామా చేశారు. నాటి నుంచి భారత్- బంగ్లా సంబంధాలు పూర్తిగా దెబ్బతిన్నాయి. భారత్‌కు వ్యతిరేకంగా అక్కడి నాయకులు పలు వివాదాస్పద వ్యాఖ్యలు చేస్తున్నారు. అయితే.. వీటిని ఎప్పటికప్పుడు భారత్ ఖండిస్తూనే ఉంది.

# గ్రామస్థాయి సామర్థ్యాల పెంపునకు కృషి: పవన్ సూచన

అమరావతి,డిసెంబర్17: రాష్ట్రాభివృద్ధికి సహకరిస్తున్న కలెక్టర్లు అందరికీ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ అభినందనలు తెలియజేశారు. 5 వ జిల్లా కలెక్టర్ల సదస్సులో డిప్యూటీ సీఎం మాట్లాడుతూ.. 4 వేల కిలోమీటర్ల మేర గ్రామీణ ప్రాంతాల్లో రోడ్లు వేశామన్నారు. 1.20 లక్షల ఫాం పాండ్స్ తవ్వి లక్ష్యాలను చేరుకున్నామన్నారు. రూ. 4,330 కోట్ల మేర నిధులను వేతనాలుగా నరేగా నుంచి చెల్లించామని.. గ్రామ పంచాయితీల్లో రెవెన్యూ ఆర్జనపై కూడా దృష్టి సారించామని చెప్పారు.గ్రామీణ స్థాయిలో పాలనా సామర్థ్యాల పెంపు కోసం కృషి చేయాలని



సూచించారు. మారుమూల గిరిజన గ్రామాల అభివృద్ధిపైనా కలెక్టర్లు దృష్టి పెట్టాలని అన్నారు. కేంద్ర పథకాల అమలులో వంద శాతం ఫలితాలు సాధించిన అల్లూరి, పార్వతీపురం మన్యం జిల్లాల కలెక్టర్లను ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ అభినందించారు.

# అమరావతిలోనే గణతంత్ర వేడుకలు

అమరావతి,డిసెంబర్17: గణతంత్ర దినోత్సవం సమీపిస్తున్న తరుణంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఈసారి రిపబ్లిక్ డే వేడుకలను రాష్ట్ర రాజధాని అయిన అమరావతిలోనే నిర్వహించాలని ప్రభుత్వం ఆలోచిస్తోంది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ విభజన అనంతరం ప్రతి ఏటా విజయవాడలోని ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో రిపబ్లిక్ డే వేడుకలు నిర్వహిస్తూ వస్తున్నారు. అయితే, ఈసారి మాత్రం రాజధాని అమరావతిలోనే రిపబ్లిక్ డే వేడుకలు నిర్వహించాలని ప్రభుత్వం భావిస్తోంది. ఈ మేరకు రాయపూడి సీఆర్డీఏ ఆఫీసు



సమీపంలో 20 ఎకరాల్లో రిపబ్లిక్ డే వేడుకలకు ఏర్పాట్లు చేయాలని సీఆర్డీఏకు రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలు ఇచ్చినట్లు సమాచారం.

# కాంగ్రెస్, బిఆర్ఎస్ వర్గాల ఘర్షణ

## ఇరువర్గాలను చెదరగొట్టిన పోలీసులు

ఖమ్మం,డిసెంబర్17: ఖమ్మం జిల్లా టేకులపల్లి మండలం బద్దుతండాలో కాంగ్రెస్, బీఆర్ఎస్ వర్గీయుల మధ్య ఘర్షణ చోటుచేసుకుంది. ఓ వ్యక్తి తొలుత గుర్తింపు కార్డు లేకుండా పోలింగ్ కేంద్రానికి వెళ్లాడు. ఓటేసేందుకు అధికారులు నిరాకరించడంతో వెనుదిరిగాడు. ఆ తర్వాత గుర్తింపు కార్డుతో మరోసారి అక్కడికి వచ్చాడు. ఈ క్రమంలో గమనించిన కాంగ్రెస్ అభ్యర్థి భూక్యా గంగారావు.. సదరు వ్యక్తి దొంగ ఓటు వేస్తున్నాడని ఆరోపిస్తూ ఆగ్రహానికి గురై అతడిపై చేయిచేసుకున్నాడు. దీంతో ఇరు పార్టీల కార్యకర్తల మధ్య జరిగిన వాగ్వాదం ఘర్షణకు దారి తీసింది. పోలీసులు అక్కడికి చేరుకుని ఇరు వర్గాలను చెదరగొట్టారు. టేకులపల్లి సీఐ బత్తుల సత్యనారాయణ, ఎస్సై రాజేందర్ ఆధ్వర్యంలో పోలీసులు పరిస్థితిని అదుపులోకి తీసుకొచ్చారు. నల్గొండ జిల్లా డిండి మండలం శాంతిగూడెంలోనూ రెండు వర్గాల మధ్య ఘర్షణ జరిగింది. బీఆర్ఎస్, కాంగ్రెస్ కార్యకర్తలు పరస్పరం దాడి చేసుకున్నారు. ఈ ఘటనలో ఒకరికి గాయమైంది. అతడిని ఆస్పత్రికి తరలించారు. పోలీసులు అక్కడికి చేరుకుని ఇరువర్గాలను చెదరగొట్టారు. కరీంనగర్ జిల్లా జమ్మికుంట మండలం విలాసాగర్‌లో సర్పంచ్ అభ్యర్థి వద్ద పోలీసులు నగదు స్వాధీనం చేసుకన్నారు. స్థానిక పోలింగ్ కేంద్రం సమీపంలో జనం గుమిగూడి ఉండటంతో పోలీసులు అక్కడికి వెళ్లారు. సర్పంచ్ అభ్యర్థి వద్ద రూ.28,500 నగదును స్వాధీనం చేసుకున్నారు.

అశోక్ టండన్ రాసిన పుస్తకం 'అటల్ సంస్మరణ్'లో ఇప్పుడు విషయాలు చర్చకు వస్తున్నాయి. అయితే వాజ్‌పేయ్ తిరస్కరణతో ఈ వ్యవహారం బయటరకు ర ఆకుండా పోయిందని తెలుస్తోంది. భారత రాష్ట్రపతి అభ్యర్థిగా ఏపీజే అబ్దుల్ కలామ్ పేరును ఎన్నుకోవడానికి ముందు ఆ పదవికి భాజపా అటల్ బిహారీ వాజ్‌పేయీ పేరును ప్రతిపాదించిందట. ఆ సమయంలో వాజ్‌పేయీ మీడియా సలహాదారుగా ఉన్న అశోక్ టండన్ రాసిన పుస్తకం 'అటల్ సంస్మరణ్' లో ఆయన ఈ విషయాన్ని వెల్లడించారు. వాజ్‌పేయీ పేరును రాష్ట్రపతి పదవికి ప్రతిపాదించి, ప్రధాని స్థానంలో ఆ పార్టీ అగ్రనేత ఎల్.కె.అడ్వాణీని ఎన్నుకోవాలని భాజపా సూచనలు చేసినట్లు అశోక్ టండన్ పేర్కొన్నారు. అయితే పార్టీ చేసిన ఈ ప్రతిపాదనను అప్పటి ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయీ నిరాకరించినట్లు తెలిపారు. ప్రధానిగా ఉన్న తాను రాష్ట్రపతి పదవికి మారడం సరైన చర్య కాదని తరఫున ఏపీజే అబ్దుల్ కలామ్‌ను అభ్యర్థిగా ప్రతిపాదిస్తున్నట్లు ప్రకటించారన్నారు. దీనికి కాంగ్రెస్ కూడా మద్దతు తెలపడంతో 2002లో అప్పటి ఎన్డీఏ ప్రభుత్వం, ప్రతిపక్షాల మద్దతుతో అబ్దుల్ కలామ్ భారత రాష్ట్రపతిగా ఎన్నికైనట్లు తెలిపారు.వాజ్‌పేయీ ప్రధానమంత్రిగా ఉన్న సమయంలోని అనేక ఘటనలను అశోక్ టండన్ తన పుస్తకంలో వివరించారు. అటల్-అద్వానీలకు విధానపరమైన అంశాలపై విభేదాలు ఉన్నప్పటికీ.. భారత రాజకీయాల్లో వారి భాగస్వామ్యం, సహకారం సమతుల్యతకు చిహ్నంగా ఉండేదన్నారు. వారి దిశానిర్దేశరలో భాజపా మరింత అభివృద్ధి చెందినట్లు రాసుకొచ్చారు. మొత్తంగా అద్వానీకి అదృష్టం కలసి రాలేదు. వాజ్‌పేయ్ తరవాత పదేళ్ల యూపీఏ పాలన సాగింది. ఆ సమయంలో రెండుసార్లు ఎన్నికల్లో బీజెపి ప్రతిపక్షానికే పరిమితం అయ్యింది. ఆ తరవాత మోడీని ప్రధాని అభ్యర్థిగా ప్రతిపాదించడంతో ఇక అద్వానీకి అవకాశం లేకుండా పోయింది.





న్యూఢిల్లీ,డిసెంబర్17: బంగారం, వెండి ధరల ర్యాలీ మళ్లీ మొదలైంది. మంగళవారం కాస్తంత తగ్గినట్టు అనిపించిన బంగారం, వెండి ధరలు బుధవారం ట్రేడింగ్ ప్రారంభం కాగానే ఆకాశాన్ని తాకాయి. పేదల బంగారంగా పేరుపడ్డ వెండి ధర వేగంగా పెరగడం చూసి జనాలు హడలిపోతున్నారు. గుడ్‌రిటర్న్స్ వెబ్‌సైట్ ప్రకారం, బుధవారం ఉదయం 11.00 గంటలకు భారత్‌లో 24 క్యారెట్ 10 గ్రాముల బంగారం ధర రూ.1,34,510కు చేరుకుంది. నిన్నటి ముగింపు ధరతో పోలిస్తే ఇది రూ.650 అధికం. ఇక 22 క్యారెట్ ఆర్నమెంటల్ పసిడి ధర కూడా రూ.600 మేర పెరిగి 1,23,300కు చేరుకుంది. వెండి ధర మాత్రం సామాన్యులను హడలెత్తించే స్థాయిలో పెరిగింది. ట్రేడింగ్ మొదలైన గంటల వ్యవధిలోనే ఏకంగా రూ.8900 మేర పెరిగి రూ.2,08,000కు చేరుకుంది. చెన్నైలో 24 క్యారెట్ పసిడి (10 గ్రాములు) ధర గరిష్ఠంగా రూ.1,35,280కు చేరుకుంది. హైదరాబాద్, విజయవాడల్లో కూడా ఇదే రేటు కొనసాగుతోంది. ఇక 22 క్యారెట్ 10 గ్రాముల బంగారం ధర చెన్నైలో రూ.1,24,000గా హైదరాబాద్, విజయవాడల్లో రూ.1,23,300గా ఉంది. కిలో వెండి ధర చెన్నైలో అత్యధికంగా రూ.2,22,000కు చేరుకుంది. హైదరాబాద్, విజయవాడల్లో కూడా ధర ఇదే రేంజ్‌లో కొనసాగుతోంది. బుధవారం ట్రేడింగ్‌లో ఇప్పటివరకూ బంగారం ధరలు అర శాతం మేర పెరగ్గా వెండి ఏకంగా 4 శాతం మేర పెరిగిందని మార్కెట్ నిపుణులు చెబుతున్నారు. అమెరికాలో నిరుద్యోగిత పెరుగుతుండటంతో ఫెడ్ రేట్ కోత మళ్లీ ఉంటుందన్న అంచనాలు, ఇతర సానుకూల భౌగోళిక రాజకీయ అంశాలు ధరలకు రెక్కలొచ్చేలా చేశాయి.

# ఆపరేషన్ సిందూర్ వ్యవహారం

### పృథ్వీరాజ్ చౌహాన్ వివాదాస్పద వ్యాఖ్యలు క్షమాపణలు చెప్పేది లేదని ప్రకటన

ముంబై, డిసెంబర్17: ఆపరేషన్ సిందూర్‌పై మహారాష్ట్ర మాజీ సిఎం పృథ్వీరాజ్ చవాన్ వ్యాఖ్యలు దుమారం రేపుతున్నాయి. అయితే తాను క్షమాపణలు చెప్పేది లేదని ఆయన ప్రకటించారు. పహల్గాంలో ఉగ్ర దాడికి ప్రతీకారంగా భారత్ చేసిన ఆపరేషన్ సిందూర్ గురించి మహారాష్ట్ర మాజీ సీఎం, కాంగ్రెస్ సీనియర్ నేత పృథ్వీరాజ్ చవాన్ చేసిన వ్యాఖ్యలు తీవ్ర దుమారం రేపుతున్నాయి. చవాన్ వ్యాఖ్యలను భాజపా తీవ్రంగా ఖండించింది. ఈ క్రమంలో తన వ్యాఖ్యలను సమర్థించుకుంటూ క్షమాపణలు చెప్పేది లేదని స్పష్టం చేశారు. పుణెలిలో విలేకరులతో మాట్లాడుతూ.. ఆపరేషన్ సిందూర్ గురించి పలు వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. ఇవికాస్త రాజకీయంగా దుమారం రేపుతున్నాయి. దీనిపై భాజపా జాతీయ అధికార ప్రతినిధి సీఆర్ కేశవన్ మాట్లాడుతూ.. పృథ్వీరాజ్ చవాన్ పాకిస్థాన్ ప్రతినిధిలా



మాట్లాడుతున్నారని విమర్శించారు. విజయ్ దివస్ నాడు మన సాయుధ దళాలను ఉద్దేశపూర్వకంగా దూషించి, వారిని రద్దు చేయాలంటూ వ్యాఖ్యానించడంపై ఆగ్రహం వ్యక్తంచేశారు. చవాన్ వ్యాఖ్యలను కాంగ్రెస్ అగ్ర నేతలు సోనియా, రాహుల్ గాంధీలు ఎందుకు ఖండించలేదని, ఆయనపై చర్యలు ఎందుకు తీసుకోలేదని ప్రశ్నించారు. ఈ సందర్భంగా సైన్యంపై గతంలో రాహుల్ చేసిన వ్యాఖ్యలపై సుప్రీంకోర్టు మందలించిన విషయాన్ని ప్రస్తావించారు. చవాన్‌పై చర్యలు తీసుకోవాలని, ఆయన క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. భాజపా రాజ్యసభ ఎంపీ బ్రిజ్‌లాల్ కూడా చవాన్ వ్యాఖ్యలను ఖండించారు. కాంగ్రెస్ ఎప్పుడూ పాక్‌కు అనుకూలంగా వ్యాఖ్యలు చేస్తూ.. భారత్‌ను అవమానిస్తుందని విరుచుకుపడ్డారు. ఇక, భాజపా నేతల ప్రతిస్పందనల క్రమంలో చవాన్ తన వ్యాఖ్యలను సమర్థించుకున్నారు. 'ఇప్పుడు దీని గురించి నేను ఇంకేమీ చెప్పాలనుకోవడం లేదు. కానీ నేను ఎలాంటి క్షమాపణ చెప్పను. దాని అవసరం లేదు. నేను ఎలాంటి తప్పుడు వ్యాఖ్యలు చేయలేదని విలేకరులతో అన్నారు.

## రాజధాని కాలుష్యంపై ఆందోళన

### 50శాతం వర్క్ ఫ్రమ్ హోమ్‌కు సర్కార్ ఆదేశం



న్యూఢిల్లీ, డిసెంబర్17: దేశ రాజధాని ఢిల్లీ కాలుష్య కోరల్లో చిక్కుకుని అల్లాడిపోతోంది. శీతాకాలం కావడంతో ఢిల్లీలో వాయు కాలుష్య సంక్షోభం తలెత్తింది. గత కొన్ని రోజులుగా వాయు కాలుష్యం ప్రమాదకరస్థాయిలో నమోదవుతోంది. ఏక్యూఐ లెవెల్స్ 400కిపైనే నమోదవుతున్నాయి. దీంతో ప్రజలు పలు ఆరోగ్య సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారు. ఈ నేపథ్యంలో కాలుష్య కట్టడికి ప్రభుత్వం కఠిన నిబంధనలు అమలు చేస్తోంది. ఇప్పటికే పలు ఆంక్షలు విధించిన విషయం తెలిసిందే. తాజాగా మరో కీలక నిర్ణయం తీసుకుంది. నగరంలోని అన్ని సంస్థలకు 50శాతం వర్క్ ఫ్రమ్ హోమ్‌ను తప్పనిసరి చేసింది. ఢిల్లీ ప్రభుత్వం ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేసింది. నగరంలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ సంస్థలు తప్పనిసరిగా 50 శాతం వర్క్ ఫ్రమ్ హోమ్ పద్ధతిలో పనిచేయాలని ఆదేశించింది. ఈ ఆదేశాలను ఉల్లంఘించిన వారికి జరిమానాలు విధిస్తామని కూడా హెచ్చరించింది. అంతేకాదు, కాలుష్య నిరోధక ఆంక్షల కారణంగా పని కోల్పోయిన రిజిస్టర్డ్ నిర్మాణ కార్మికులకు రూ. 10,000 పరిహారం అందించనున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. రాజధాని ఢిల్లీలో కాలుష్యం కట్టడిపై అక్కడి ట్రిపుల్ ఇంజిన్ సర్కారు చేతులెత్తేసింది. రోజురోజుకూ దిగజారుతున్న కాలుష్య ప్రమాణాలపై బీజేపీ మంత్రి మంజీందర్ సింగ్ మంగళవారం ప్రజలకు క్షమాపణ చెప్పారు. కాలుష్య కారణంగా ప్రజలు ఇబ్బందులు పడుతున్న మాట వాస్తవమేనని అంగీకరించిన ఆయన, ఆ తప్పునకు మాత్రం మునుపటి ఆప్ ప్రభుత్వమే కారణమని ఆరోపించారు. కేవలం 9,10 నెలల్లో కాలుష్య స్థాయిని తగ్గించడం సాధ్యం కాదన్నారు. ఢిల్లీలో కాలుష్యం నేపథ్యంలో ఇక నుంచి పొల్యూషన్ అండర్ కంట్రోల్ సర్టిఫికెట్ (ఖజఅఅ)ని చూపిన వాహనదారులకే ఇంధనం నింపాలని ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

# ప్రధాని నరేంద్ర మోదీకి అరుదైన గౌరవతం

### ఇథియోపియా దేశ అత్యున్నత పురస్కారం ప్రదానం



న్యూఢిల్లీ, డిసెంబర్17: భారత ప్రధాని నరేంద్ర మోదీకి ఇథియోపియా దేశ అత్యున్నత పురస్కారం వరించింది. అదిస్ ఇంటర్నేషనల్ కన్వెన్షన్‌లో మంగళవారం జరిగిన ఓ కార్యక్రమంలో ఆ దేశ ప్రధాని డాక్టర్ అబి అహ్మద్ అలీ.. 'ది గ్రేట్ ఆనర్ ఆఫ్ నిషాన్ ఆఫ్ ఇథియోపియా' అవార్డుతో మోదీని సత్కరించారు. ఈ సందర్భంగా ప్రధాని మోదీ స్పందిస్తూ.. భారతీయులందరి తరఫునా ఈ అవార్డు స్వీకరిస్తున్నానన్నారు. భారత్-ఇథియోపియా బంధాలను పటిష్ఠం చేసేందుకు సహకరించిన ఎందరో భారతీయులకు ఇది గుర్తింపు అభివర్ణించిన మోదీ.. ఆ దేశ ప్రధాని అబీ అహ్మద్ అలీకి కృతజ్ఞతలు తెలిపారు. మోదీ.. తన తొలి ద్వైపాక్షిక పర్యటనలో భాగంగా ఇథియోపియా రాజధాని అదిస్ అబాబా చేరుకున్నారు. అంతకముందు.. విమానాశ్రయంలో ఆయనకు అబీ అహ్మద్ అలీ ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఇరు దేశాల ప్రధానుల మధ్య పరస్పర ప్రయోజనకర విస్తృత స్థాయి ద్వైపాక్షిక చర్చలు జరిగాయి. థియోపియాకు వెళ్లడానికి ముందు జోర్డాన్ దేశంలో పర్యటించారు మోదీ. ఆ దేశ రాజధాని అమ్మాన్‌లో జరిగిన ఓ కార్యక్రమంలో పాల్గొన్నారు. రానున్న ఐదేళ్లలో భారత్-జోర్డాన్ ద్వైపాక్షిక వాణిజ్య బంధాన్ని రెట్టింపు చేసి 500 కోట్ల డాలర్ల స్థాయికి చేరుకునేలా ప్రయత్నం చేస్తామని ఆశాభావం వ్యక్తం చేశారు. భారతదేశ ఆర్థికాభివృద్ధిలో భాగస్వామ్యం వహించి లబ్ధి పొందాలని ఆ దేశ వాణిజ్య సంస్థలను కోరారు మోదీ. ఈ కార్యక్రమంలో ఆ దేశ యువరాజు హుసేన్ సహా వాణిజ్య, పరిశ్రమల శాఖల విభాగాధిపతులు పాల్గొన్నారు.

## ఆధార్ డేటా సురక్షితం

### పార్లమెంటులో కేంద్రమంత్రి వెల్లడి



న్యూఢిల్లీ, డిసెంబర్ 17: భారత విశిష్ట గుర్తింపు ప్రాధికార సంస్థ డేటా బేస్ నుంచి ఆధార్‌కార్డు హోల్డర్ల డేటా దుర్వినియోగం జరగలేదని కేంద్రం స్పష్టంచేసింది. ఆధార్ డేటా బదిలీ, స్టోరేజీ సమయంలో అధునాతన ఎన్‌క్రిప్షన్ టెక్నాలజీని వినియోగిస్తున్నట్లు మంత్రి వెల్లడించారు. నేషనల్ క్రిటికల్ ఇన్ఫర్మేషన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ప్రొటెక్షన్ సెంటర్ పర్యవేక్షణలో ఆధార్ వ్యవస్థ సురక్షితంగా ఉందని తెలిపారు. అధు నాతన భద్రతా చర్యల కారణంగా పౌరుల ఆధార్ డేటా సురక్షితంగా ఉందని కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్‌కు వెల్లడించింది. ఈ మేరకు కేంద్ర ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ శాఖ సహాయ మంత్రి జితిన్ ప్రసాద లోక్‌సభలో ఓ ప్రశ్నకు సమాధానం ఇచ్చారు. ప్రపంచంలోనే అతిపెద్ద బయోమెట్రిక్ గుర్తింపు వ్యవస్థ అయిన ఉడాయ్‌లో సుమారు 134 కోట్ల మంది ఆధార్ హోల్డర్లు ఉన్నారు. ఇప్పటి వరకు 16వేల కోట్ల అథంటికేషన్ లావాదేవీలు జరిగాయని కేంద్రమంత్రి తన సమాధానంలో వెల్లడించారు. బలమైన సాంకేతిక, సంస్థాగత భద్రతా చర్యల కారణంగా ఆధార్ డేటా సురక్షితంగా ఉందని తెలిపారు. ఆధార్ డేటా భద్రతకు ఉడాయ్.. డిఫెన్స్- ఇన్- డెప్త్ విధానాన్ని అనుసరిస్తూ బహుళ అంచెల భద్రతా వ్యవస్థను అమలు చేస్తోందన్నారు. ఇందులో ఒక లేయర్ దెబ్బతిన్నా.. మిగిలినవి డేటాకు రక్షణ కల్పిస్తాయని చెప్పారు. ఇది ఎప్పటికప్పుడు ఆధార్ సైబర్ సెక్యూరిటీకి సంబంధించి సూచనలు చేస్తుంటుందని పేర్కొన్నారు. దీనికితోడు స్వతంత్ర ఆడిట్ ఏజెన్సీలు కూడా ఆధార్ ఎకోసిస్టమ్‌ను నిరంతరం పర్యవేక్షిస్తున్నాయని తెలిపారు.

# జర్మనీలో రాహుల్ పర్యటన

### మ్యూనిచ్‌లో బిండబ్ల్యూ ప్లాంట్ సందర్శప

### తయారీరంగం బలోపేతంపై దృష్టి పెట్టాలని సూచన



బెర్లిన,డిసెంబర్17: జర్మనీలో కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ పర్యటన బిజీబిజీగా సాగుతోంది. ఈ పర్యటనలో భాగంగా మ్యూనిచ్‌లోని బీఎండబ్ల్యూ ప్లాంట్‌ను రాహుల్ గాంధీ సందర్శించారు. అందులోని తాజా మోడల్ కార్లు, ఎలక్ట్రిక్ బైక్‌లు.. ఎం సీరిస్, బీఎండబ్ల్యూ ఐఎస్3, రూల్స్ రాయిస్ తదితర వాహనాలను ఆయన పరిశీలించారు. అనంతరం రాహుల్ గాంధీ మాట్లాడుతూ.. తయారీ రంగంపై దృష్టి పెట్టాలంటూ కేంద్ర ప్రభుత్వానికి సూచించారు. దేశంలో చిరు వ్యాపారులను పట్టించుకోవడం లేదంటూ కేంద్ర వైఖరిని తప్పుపట్టారు. ఈ సందర్భంగా తన ఇన్‌స్టాగ్రామ్ వేదికగా ఒక వీడియోను పోస్ట్ చేసి ఆయన.. కొన్ని కీలక వ్యాఖ్యలు చేశారు. టీవీఎస్ 450 సీసీ మోటర్ సైకిల్‌ను బీఎండబ్ల్యూ భాగస్వామ్యంతో అభివృద్ధి చేస్తున్నారని తెలిపారు. ఇది భారతీయ ఇంజినీరింగ్ పనితనానికి గర్వకారణంగా ఉందన్నారు. తయారీ రంగం.. బలమైన ఆర్థికాభివృద్ధికి వెన్నుముక వంటిందని అభివర్ణించారు. కానీ విచారం ఏమింటే.. భారత్‌లో మాత్రం ఈ తయారీ రంగం అనేది తగ్గిపోతుందంటూ ఆవేదన వ్యక్తం చేశారు. అభివృద్ధిని వేగవంతం చేయాలంటే.. మనం మరిన్ని ఉత్పత్తి చేయాల్సి ఉందన్నారు.పార్లమెంట్ శీతకాల సమావేశాలు జరుగుతున్నాయి. డిసెంబర్ 15 నుంచి 20వ వరకు జర్మనీ రాజధాని బెర్లిన్ వేదికగా ఇండియన్ ఓవర్సీస్ కాంగ్రెస్ జరుగుతుంది. ఇందులో పాల్గొనేందుకు లోక్ సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ జర్మనీ వెళ్లారు. రాహుల్ చేస్తున్న ఈ పర్యటనపై బీజేపీ వ్యంగ్యంగా స్పందించింది. ఒక వైపు పార్లమెంట్ శీతకాల సమావేశాలు జరుగుతుండగా.. ఆయన విదేశాలకు వెళ్లడం ఏమిటని ప్రశ్నించింది. దేనికి ప్రాధాన్యత ఇవ్వాల్లో రాహుల్‌కు తెలియదని ఆ పార్టీ అభిప్రాయపడింది. అంతేకాదు.. లీడర్ ఆఫ్ పర్యటన్, లీడర్ ఆఫ్ పార్టీయింగ్ అని వ్యాఖ్యానించింది. బిహార్ అసెంబ్లీ ఎన్నికల వేళ.. ఆయన పర్యటనపై బీజేపీ ఈ సందర్భంగా విమర్శలు గుప్పించింది. బీజేపీ విమర్శలపై రాహుల్ సోదరి ప్రియాంకా గాంధీ కాస్తా ఘాటుగా స్పందించారు. అయితే 2005లో అప్పటి యూపీయే ప్రభుత్వం.. జాతీయ ఉపాధి హామీ పథకం ప్రవేశ పెట్టింది. దీనికి జాతిపిత మహాత్మా గాంధీ పేరు పెట్టింది. తాజాగా కేంద్రంలోని ఎన్డీయే ప్రభుత్వం ఈ పేరును మార్చేసింది. దీనిపై కాంగ్రెస్ పార్టీ ఆగ్రహం వ్యక్తం చేసింది. దేశ చరిత్ర నుంచి గాంధీ, నెహ్రూల పాత్ర చెరిపేసే కుట్ర జరుగుతుందంటూ కాంగ్రెస్ పార్టీ మండిపడింది. నేపథ్యంలో దేశవ్యాప్తంగా ఆందోళనకు ఆ పార్టీ పిలుపునిచ్చింది. ఇక పార్లమెంట్ శీతకాల సమావేశాలు డిసెంబర్ 19వ తేదీతో ముగియనున్నాయి. ఈ సమావేశాల చివరి మూడు రోజులు సభ్యులంతా సభకు హాజరు కావాలంటూ ఇప్పటికే ఆ పార్టీ విప్ జారీ చేసింది. మరి ఆ జాబితాలో పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ పేరు లేక పోవడం గమనార్హం.

# పెన్షన్ భిక్ష కాదు ఉద్యోగుల

## రాజ్యాంగబద్ధమైన హక్కు : పెన్షనర్లకు జాగ్రత్తే భద్రత

### జాతీయ పెన్షనర్స్ డే ఘనంగా – 800 మంది పెన్షనర్లతో కరీంనగర్‌లో వేడుకలు



**కరీంనగర్, డిసెంబర్ 17:** కరీంనగర్ జిల్లా కేంద్రంలోని స్థానిక టీఎన్జీవోల సంఘ భవనంలో టీఎన్జీవోల సంఘం ఆధ్వర్యంలో జాతీయ పెన్షనర్స్ డేను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా టీపీసీఏ అసోసియేషన్ అధ్యక్షులు పెండ్యాల కేశవ రెడ్డి, ఎలదాసరి లింగయ్య గార్లు అధ్యక్షత వహించగా, ముఖ్య అతిథులుగా అడిషనల్ కలెక్టర్ (రెవెన్యూ) లక్ష్మీ కిరణ్, ఆర్డీవో మహేష్ కుమార్ పాల్గొన్నారు. కార్యక్రమ ప్రారంభంలో కీర్తిశేషులు సకారా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి, జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంప్లాయిస్ జేఏసీ చైర్మన్, టీఎన్జీవోల జిల్లా అధ్యక్షులు దారం శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ, పెన్షన్ అనేది భిక్ష కాదని, దయాదాక్షిణ్యం కాదని, 30–35 సంవత్సరాలు ప్రజాసేవ చేసిన ఉద్యోగికి వృద్ధాప్యంలో సామాజిక–ఆర్థిక భద్రత కల్పించే హక్కు అని సుప్రీంకోర్టు తీర్పు స్పష్టం చేసిందని తెలిపారు. పెన్షన్ వ్యవస్థను పునరుద్ధరింపజేసిన సకారా న్యాయపోరాటానికి జిల్లా పెన్షనర్ల సంఘం మరియు తెలంగాణ ఎన్జీవోల సంఘం తరఫున కృతజ్ఞతలు తెలియజేశారు. అలాగే నేటి కల్తీ యుగంలో పెన్షనర్లు ఆర్థిక లావాదేవీల విషయంలో అప్రమత్తంగా ఉండాలని, సీపీఎస్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించేందుకు సమిష్టి పోరాటం అవసరమని పిలుపునిచ్చారు.ముఖ్య అతిథులుగా మాట్లాడిన అడిషనల్ కలెక్టర్ లక్ష్మీ కిరణ్, ఆర్డీవో మహేష్ కుమార్ మాట్లాడుతూ, తమ వద్దకు సీనియర్ సిటిజన్లకు సంబంధించిన అనేక కుటుంబ, ఆర్థిక సమస్యలు, మోసాలకు సంబంధించిన కేసులు వస్తున్నాయని, పెన్షనర్లు ఎవరినీ అతిగా నమ్మకుండా జాగ్రత్తగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పెన్షనర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు గాజుల నరసయ్య, జిల్లా కార్యదర్శి సంగేం లక్ష్మణరావు, గెజిటెడ్ అధికారుల సంఘం జిల్లా అధ్యక్షులు మడిపెల్లి కాళీచరణ్, కోశాధికారి ముప్పిడి కిరణ్ కుమార్ రెడ్డి, తెలంగాణ రాష్ట్ర మాజీ ప్రధాన కార్యదర్శి ఏ.ఎం. హమీద్, మాజీ రాష్ట్ర ఉపాధ్యక్షులు సుద్దాల రాజయ్య గౌడ్, రాష్ట్ర నాయకులు రాగి శ్రీనివాస్, సర్దార్ అర్విందర్ సింగ్, గూడ ప్రభాకర్ రెడ్డి, పట్టణ అధ్యక్షులు మారుపాక రాజేష్, హజ్జర్ భరద్వాజ్, చల్ల మోహన్ రెడ్డి, నాగుల రాజారామ్, ఆదిరెడ్డి లక్ష్మీరాజం, నరసింహ చారి, మక్సూద్ మీర్జా, సత్తయ్య, ఎల్లయ్య, పద్మారావు, రాజయ్య, లచ్చిరెడ్డి, సుధాకర్, లక్ష్మి , దయాకర్ రావు, భగవాన్ రెడ్డి, అమ్మ రాజయ్య, నరసయ్య, మహమ్మద్ అజ్జర్ అలీ తదితర ఉద్యోగ సంఘాల నాయకులు, పెన్షనర్లు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. దాదాపు 800 మంది పెన్షనర్లు పాల్గొన్న ఈ కార్యక్రమంలో 80 మంది సీనియర్ సిటిజన్లను శాలువాలు, మెమెంటోలతో సత్కరించారు. పెన్షనర్లకు భోజన సదుపాయాలు, ఫంక్షన్ హాల్ ఏర్పాటు చేసి ఘనంగా గౌరవించినందుకు టీఎన్జీవోల సంఘానికి పెన్షనర్ల సంఘం నేతలు కృతజ్ఞతలు తెలిపారు.

## సుడా చైర్మన్ ఆధ్వర్యంలో మంత్రులు శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్ లను కలిసిన సర్పంచులు





**కరీంనగర్, డిసెంబర్ 17:** ఇటీవల గెలిచిన కరీంనగర్ నియోజకవర్గానికి చెందిన సర్పంచులు సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి ఆధ్వర్యంలో హైదరాబాద్ లో మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్ బాబు,పొన్నం ప్రభాకర్ లను కలిశారు.మంత్రులు గెలిచిన సర్పంచులను అభినందించి ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలని అర్హత ఉన్న ప్రతి ఒక్క లబ్ధిదారుడికి పథకాలు అమలయ్యే విధంగా చూడాలని సూచించారు. గ్రామాలలో మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేయాలని ఏఏ గ్రామాలకు ఎన్ని నిధులు అవసరమో అంచనాలు రూపొందించి ఇవ్వాలని సూచించారు. సర్పంచుల గెలుపుకు సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి చేసిన కృషి అభినందనీయమని పేర్కొన్నారు.మంత్రులను కలిసిన వారిలో చర్లభూత్కూర్, చామనిపల్లి, దుబ్బపల్లి బహదూర్ఖాన్ పేట్, జూబ్లీ నగర్, ఎలబోతారం, ఫకీర్ పేట్, చేగుర్తి, నల్లగుంట పల్లె సర్పంచులు, ఉపసర్పంచులు ఇరుకుల్ల ఉప సర్పంచ్ మరియు మండల కాంగ్రెస్ అధ్యక్షులు కాంరెడ్డి రాంరెడ్డి, పంజాల స్వామి గౌడ్,నాయకులు పెంచాల లక్ష్మణ్ రావు,బుర్ర నారాయణ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రత్యేక కార్యాచరణతో అభివృద్ధి పక్కా

## నూతన సర్పంచులకు ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి దిశానిర్దేశం

**తిమ్మాపూర్, డిసెంబర్ 17:** ప్రత్యేక కార్యాచరణతో ముందుకు వెళితే గ్రామాల అభివృద్ధి సత్వరం సాధ్యపడుతుందని మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ అన్నారు. పంచాయతీ ఎన్నికల్లో గెలుపొందిన పలు మండలాల సర్పంచులు,వార్డు సభ్యులు బుధవారం ఎల్ఎండీ కాలనీలోని క్యాంపు కార్యాలయంలో తనను మర్యాదపూర్వకంగా కలిసేందుకు వచ్చినప్పుడు వారిని శాలువాలతో సత్కరించడమే కాకుండా గ్రామ పంచాయతీల అభివృద్ధి, ప్రజల సమస్యల పరిష్కారంపై సర్పంచులు, వార్డు సభ్యులు అనుసరించే విధానాలపై ఎమ్మెల్యే దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ మాట్లాడుతూ ఎన్నికల వరకే రాజకీయాలకు పరిమితం కావాలని, గ్రామాల అభివృద్ధి సర్పంచులు, ఉప సర్పంచులు రాజకీయాలకు అతీతంగా కలిసికట్టుగా పని చేయాలని కోరారు. పంచాయతీ పాలకవర్గాలు ప్రజలతో మమేకం కావాలని కోరారు. గ్రామాల అభివృద్ధి తనవంతు తోడ్పాటునందిస్తా నన్నారు. అభివృద్ధి పనులకు అవసరమైన నిధులు మంజూరు చేస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ఎమ్మెల్యేను మర్యాదపూర్వకంగా కలిసిన వారిలో ఇల్లంతకుంట మండలం సిరికొండ సర్పంచ్ గొడుగు విఠల్, రామోజీపేట సర్పంచ్ చొప్పరి భూమయ్య, అనంతారం సర్పంచ్ ఒల్లాల రజిత, తాళ్లపల్లి సర్పంచ్ మీసాల కనకరాజు, ఇల్లంతకుంట సర్పంచ్ మామిడి రాజు, మానకొండూర్ మండలం రంగపేట గ్రామ సర్పంచ్ కొత్త రాంరెడ్డి, ఉప సర్పంచ్ వేల్పుల కొమురయ్య, వార్డు సభ్యులు మ్రి రమ్య, గోపు రవళి, గుడాల మహేందర్, మ్రి సంపత్ రావు, రుద్రారం అశోక్, రుద్రారం లక్ష్మణ్, కొత్త శ్రీకాంత్ రెడ్డి, షేక్ కరీంబీ, నిజాయతీగూడెం గ్రామ సర్పంచ్ బోళ్ల సరిత–మురళీధర్,వార్డు సభ్యులు గుర్రం స్వప్న–శ్రీనివాస్, బొలవేణి స్రవంతి–ఓదెలు, గద్దె అయిలయ్య, తిమ్మాపూర్ మండలం నల్లగొండ గ్రామ సర్పంచు జింక మారుతి పలు గ్రామాల సర్పంచులు, వార్డు సభ్యులు ఉన్నారు. అలాగే కేశవపట్నం గ్రామం సర్పంచుగా ఎన్నికైన రాజేంద్రప్రసాద్ (స్వతంత్ర) కూడా ఎమ్మెల్యేను క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ కార్యక్రమంలో ఇల్లంతకుంట మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కోమటిరెడ్డి భాస్కర్ రెడ్డి, మండల పరిషత్ మాజీ అధ్యక్షుడు ఊట్కూరి వెంకటరమణారెడ్డి, పార్టీ నాయకులు ఐరెడ్డి మహేందర్ రెడ్డి, గొల్లపల్లి శ్రీనివాస్, గొడుగు పోచాలు, దాసరి రాజయ్య, బాల కిషన్ రావు, పెంచాల రాజయ్య, ఆకుల బాపురావు, నీరటి మొగిలి, కనుకం రాజేశం, మ్యాదరి తిరుపతి, బాకారపు సమ్మయ్య, సంతోష్, కుమారస్వామి, మారెల్ల నాగిరెడ్డి, రేవెల్లి రాజలింగం, కంకణాల రవీందర్ రెడ్డి, పోలం పోచాలు తదితరులు ఉన్నారు.







**కరీంనగర్, డిసెంబర్ 17:**స్థానిక నగరంలోని పారమిత ఉన్నత పాఠశాలలో 6వ తరగతి చదువుతున్న విద్యార్థి ఎం.చాణక్యన్ రాష్ట్ర స్థాయి బాక్సింగ్ పోటీలకు ఎంపిక అయ్యాడని పాఠశాల ప్రధానోపాధ్యాయులు ప్రశాంత్ తెలిపారు. డిసెంబర్ 15 న కరీంనగర్ పట్టణంలోని అంబేద్కర్ స్టేడియంలో జిల్లా ఎస్.జి.ఎఫ్ వారి ఆధ్వర్యంలో నిర్వహించిన ఉమ్మడి జిల్లా ఎస్.జి.ఎఫ్ అండర్ 14 బాలుర బాక్సింగ్ చాంపియన్షిప్ పోటీలలో పారమిత ఉన్నత పాఠశాలలో 6వ తరగతి చదువుతున్న ఎం.చాణక్యన్ 32 –34 కిలోల విభాగంలో బంగారు పథకం సాధించి రాష్ట్ర స్థాయి బాక్సింగ్ పోటీలకు ఎంపికైనాడు. రాష్ట్ర స్థాయి పాఠశాలల క్రీడా సమాఖ్య వారి ఆధ్వర్యంలో హన్మకొండ పట్టణంలోని జె.ఎన్ స్టేడియంలోని బాక్సింగ్ హాల్ లో డిసెంబర్ 18 నుండి 25 వరకు తేదీలో నిర్వ హించనున్న 69వ రాష్ట్ర స్థాయి బాక్సింగ్ చాంపియన్ షిప్ పోటీలలో పాల్గొననున్నారు. ఈ సందర్భంగా పాఠశాల చైర్మన్ డా. ఇనుగంటి ప్రసాదరావు మరియు పాఠశాల డైరెక్టర్లు . ప్రసూన, రాకేష్, రశ్మిత, అనుకర్ రావు, వినోదరావు, వి.యు. ఎం. ప్రసాద్, హనుమంతరావు. ప్రధానోపాధ్యాయులు ప్రశాంత్, బాలాజీ, కవిత ప్రసాద్ సమన్వయకర్త శ్రీనాథ్ లు రాష్ట్ర స్థాయి పోటీలలో పాల్గొనే విద్యార్థిని మరియు బాక్సింగ్ కోచ్ ఎ.రామకృష్ణ ను అభినందించారు.

## బాల వివాహాల నిరోధక చట్టంపై అవగాహన..



**కరీంనగర్, డిసెంబర్ 17 :** " బాల్ వివాహ ముక్త్ భారత్ " వంద రోజుల ప్రణాళికలో భాగంగా కరీంనగర్లోని ఓల్డ్ హైస్కూల్లో బుధవారం రోజున బాల వివాహాల నిరోధక చట్టం పై అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పిల్లలకు చట్టంలోని అంశాలపై, వివాహ వయసు , అర్హతపై పూర్తి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో చైల్డ్ హెల్ప్ లైన్ ప్రాజెక్ట్ కో ఆర్డినేటర్ ఆవుల సంపత్ యాదవ్, డిస్టిక్ చైల్డ్ ప్రొటెక్షన్ యూనిట్ నుండి సాదినేని రమేష్, ప్రధానోపాధ్యాయురాలు వసుంధర, పాఠశాల ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## పల్లె పోరు సమాప్తం..



**ఆదిలాబాద్, డిసెంబర్ 17:** ఉమ్మడి జిల్లాలో పంచాయతీ ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి. సుమారు నెల రోజుల పాటు పల్లెల్లో రసవత్తరంగా సాగిన ఎన్నికలు సమాప్తమయ్యాయి. బుధవారం ఉమ్మడి జిల్లాలోని పలు గ్రామాల్లో నిర్వహించిన ఎన్నికలు ప్రశాంతంగా ముగియడంతో అధికార, పోలీసు యంత్రాంగం ఊపిరి పీల్చుకుంది. మూడు విడతల్లో నిర్వహించిన పంచాయతీ ఎన్నికలు ముగియడంతో ఇక నుంచి అందరి దృష్టి ఎంపిటిసీ, జడ్పిటీసీ ఎన్నికలపై పడింది. కాగా మూడో విడత పంచాయతీ ఎన్నికల్లో భాగంగా ఆదిలాబాద్ జిల్లాలో 82.56శాతం పోలింగ్ నమోదైంది. ఆదిలాబాద్ జిల్లాలో మూడో విడతలో 156గ్రామ పంచాయతీలకు ఎన్నికలు జరగాల్సి ఉండగా ఇందులో 35గ్రామ పంచాయతీలు ఇది వరకు ఏకగ్రీవమయ్యాయి. తాజాగా 121 పంచాయతీలు, 1009వార్డులకు ఎన్నికలు జరిగాయి. వీటి పరిధిలో 1,24,880 ఓటర్లు ఉండగా.. 1,03,104మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఇందులో పురుషులు 60744మంది ఓటర్లకు గాను 50597 మంది ఓటు వేశారు. మహిళలు 64,234మంది ఓటర్లు ఉండగా.. 52,507మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. 82.56శాతం పోలింగ్ నమోదైంది. ఉదయం 7గంటలకు ప్రారంభమైన పోలింగ్ మధ్యాహ్నం 1గంట వరకు కొనసాగింది. మధ్యాహ్నం 2గంటల నుంచి ఓట్ల లెక్కింపు చేపట్టారు. తొలుత వార్డు సభ్యుల ఫలితాలు ప్రకటించగా.. అనంతరం సర్పంచ్ అభ్యర్థుల ఫలితాలు వెల్లడించారు. కాగా ఓటర్లు ఉదయం నుంచే పోలింగ్ కేంద్రాల వద్ద బారులు తీరారు. పోలీసులు పోలింగ్ కేంద్రాల వద్ద భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. గ్రామస్తులు ఉత్సాహంగా ఓటు వేసేందుకు పోలింగ్ కేంద్రాలకు తరలి వచ్చారు.

**గెలిచిన వారిలో ఆనందం**

గ్రామ పంచాయతీ ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా అభ్యర్థులు ప్రచారం నిర్వహించారు. గడప గడపకు వెళ్లి ఓటర్లను అభ్యర్థించారు. చివరకు ఫలితాల్లో అనుకూలంగా వచ్చిన అభ్యర్థులు ఆనందం వ్యక్తం చేయగా.. ఓడిన వారిలో నైరాశ్యం అలుముకుంది. కాగా కొన్ని గ్రామాల్లో సాయంత్రం వరకు ఫలితాలు రాగా.. మరికొన్ని పల్లెల్లో రాత్రి వరకు వెలువడటంతో ఆయా గ్రామాల్లో తీవ్ర ఉత్కంఠ కు గురి చేశాయి.





**వికారాబాద్ జిల్లా. డిసెంబర్ 17.**

వికారాబాద్ పట్టణం ఎన్నెపల్లి లోని బి ఆర్ ఎస్ భవన్ (జిల్లా బి ఆర్ ఎస్ పార్టీ కార్యాలయం) లో వికారాబాద్ జిల్లా బి ఆర్ ఎస్ పార్టీ అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్ ను మర్యాద పూర్వకంగా కలిసిన నూతనంగా ఎన్నికైన మోమిన్ పేట్ మండలం టేకులపల్లి గ్రామ సర్పంచ్ విష్ణు వర్ధన్ రెడ్డి ఎన్కతల గ్రామ సర్పంచ్ శ్రీకాంత్ గౌడ్ దుర్గం చెరువు గ్రామ సర్పంచ్ లావణ్య మోహన్ కాస్లాబాద్ గ్రామ సర్పంచ్ మధుర వేణి మోహన్ కేసారం గ్రామ సర్పంచ్ కృష్ణ లచ్చనాయక్ తండా సర్పంచ్ చోహన్ లక్ష్మి బాయి దారూర్ మండలం మోమిన్ కుర్ధు గ్రామ సర్పంచ్ ప్రభు గౌడ్ మరియు మర్పల్లి మండలం సిరిపురం గ్రామ సర్పంచ్ సంగీత కృష్ణ రెడ్డి

## సర్పంచులు గ్రామాలను ఆదర్శ గ్రామపంచాయతీలుగా తీర్చిదిద్దాలి

- మళ్ళీ వచ్చేది బీఆర్ఎస్ ప్రభుత్వమే.
- కాంగ్రెస్ బెదిరింపులకు భయపడొద్దు బీఆర్ఎస్ పార్టీ అండగా ఉంటుంది..
- రాజ్యాంగబద్ధంగా గ్రామాలకు రావాల్సిన నిధులను ఎవరూ ఆపలేరు.మాజీ ఎమ్మెల్యే
- పైలెట్ రోహిత్ రెడ్డి.



**వికారాబాద్ జిల్లా. డిసెంబర్ 17/తాండూర్**

తాండూర్ నియోజకవర్గ పరిధిలోని తాండూరు, పెద్దేముల్, యాలాల, బషీరాబాద్ మండలాల పరిధిలో నూతనంగా ఎన్నికైన బీఆర్ఎస్ పార్టీ సర్పంచులు పార్టీ సీనియర్ నాయకులతో బుధవారం తాండూరులోని ఆయన నివాసంలో సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ పార్టీ అనుసరించాల్సిన పలు విషయాలపై చర్చించారు.. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు వీరేందర్ రెడ్డి, కోహీర్ శ్రీనివాస్, రవీందర్ రెడ్డి, నర్సిరెడ్డి(రాజు)తో పాటు పలువురు నాయకులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ పార్టీ సర్పంచ్ లను సన్మానం

**పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి**



**వికారాబాద్ జిల్లా. డిసెంబర్ 17.పరిగి/**

పరిగి మండలం నరసయ్య గూడ గ్రామ సర్పంచ్ అభ్యర్థిగా కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అంజిమోని బాలరాజ్ ,ఉప సర్పంచ్‌గా నగేష్ ఘన విజయం సాధించిన నేపథ్యంలో పరిగి ఎమ్మెల్యే డాక్టర్ టి.రామ్మోహన్ రెడ్డి ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే టీ రామ్మోహన్ రెడ్డి నూతనంగా ఎన్నికైన సర్పంచ్, ఉప సర్పంచ్‌లను అభినందిస్తూ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. గ్రామ అభివృద్ధి, ప్రజల సంక్షేమం దిశగా సమిష్టిగా పనిచేయాలని సూచించారు. కాంగ్రెస్ పార్టీపై ప్రజలు చూపిన విశ్వాసానికి కృతజ్ఞతలు తెలిపారు.

వాతావరణం.

- యువత శక్తికి ప్రజల తీర్పు
- అభివృద్ధి ఆశయాలకు ఘన మద్దతు.

**మోమిన్ పేట్, డిసెంబర్ 17:**

మోమిన్‌పేట్ మండల పరిధిలోని ఇజ్రా చిట్టెంపల్లి గ్రామంలో గ్రామ సర్పంచ్ పదవికి జరిగిన ఎన్నికల్లో యువ నాయకుడు వందన విజయ్ ఘన విజయం సాధించారు. యువత ఆశయాలకు ప్రతీకగా నిలిచిన వందన విజయ్‌కు గ్రామ ప్రజలు అపూర్వమైన మద్దతు అందిస్తూ భారీ మెజారిటీతో గెలిపించారు.సంప్రదాయ రాజకీయాలకు భిన్నంగా, గ్రామ అభివృద్ధి, పారదర్శక పాలన, యువత ఉపాధి అవకాశాలు, మహిళా సాధికారత, మౌలిక సదుపాయాల బలోపేతం వంటి అంశాలతో ప్రజల ముందుకు వెళ్లిన వందన విజయ్‌పై ఓటర్లు సంపూర్ణ విశ్వాసం ఉంచారు. ఈ విజయం గ్రామ రాజకీయాల్లో యువ



వాతావరణం నెలకొంది. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన గ్రామ సర్పంచ్ వందన విజయ్ మాట్లాడుతూ, "ఈ విజయం నా ఒంటరి గెలుపు కాదు. ఇది నాపై నమ్మకం ఉంచిన ప్రతి గ్రామవాసి గెలుపు అన్నారు. ఇజ్రా చిట్టెంపల్లిని ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దేందుకు నిరంతరం శ్రమిస్తాను అని తెలిపారు.ప్రజలకుఅందుబాటులో ఉండే సర్పంచ్‌గా పని చేస్తాను" అని హామీ ఇచ్చారు. యువతకునాయకత్వ బాధ్యతలు అప్పగిస్తే గ్రామాలు ఎలా ముందుకు సాగ గలవో చూపించే ఉదాహరణగా ఈ విజయం నిలిచిందని గ్రామ పెద్దలు ప్రశంసించారు. ఇజ్రా చిట్టెంపల్లి గ్రామంలో యువ పాలనకు ఇది ఒక నూతన అధ్యాయంగా మారింది అని పలువురు ప్రముఖులు అభిప్రాయపడ్డారు. ఈ సందర్భంగా జిల్లా వ్యాప్తంగా ఈ యువ జంటకు అభినందనల వెల్లువ వెదజల్లుతుంది.

## స్వచ్ఛందంగా ఆక్రమణలు తొలగించుకోవాలి

- తాండూరు మున్సిపల్ కమిషనర్ యాదగిరి
- రోడ్లపై వ్యాపారులకు హెచ్చరిక..

**వికారాబాద్ జిల్లా. డిసెంబర్ 17.తాండూర్/**

మూడు రోజులలో రోడ్లపై ఆక్రమణలను తొలగించు కోవాలని తాండూరు మున్సిపల్ కమిషనర్ యాదగిరి వ్యాపారులకు సూచించారు. బుధవారం పట్టణంలోని పాత మున్సిపల్ కార్యాలయం ముందు నుంచి మార్కెట్ వరకు ఉన్న ప్రాంతాలను కమిషనర్ యాదగిరి పరిశీలించారు. టౌన్ ప్లానింగ్ అధికారులతో ఈ మార్గంలో ఉన్న ఆక్రమణలను పరిశీలించారు. రోడ్లపైకి వచ్చి



వ్యాపారాలు చేసున్న వారితో మాట్లాడారు. రోడ్లపై వ్యాపారాలు చేయడం వల్ల ట్రాఫిక్ సమస్యలు ఏర్పడుతున్నాయి అని అన్నారు. రోడ్లను ఆక్రమించడం పద్ధతి కాదని అన్నారు. రోడ్ల విస్తరణను దృష్టిలో ఉంచుకుని ఆక్రమణల తొలగింపుకు సహకరించాలని అన్నారు. మూడు రోజులలో అన్ని ఆక్రమణలు తొలగించుకోవాలి సూచించారు. ఇచ్చిన గడువులోగా తొలగించుకోక పోతే.. మున్సిపల్ ద్వారా తొలగించడం జరుగుతుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో టౌన్ ప్లానింగ్ అధికారులు వంశీధర్, నరేష్, ప్రియ, శానిటరీ ఇనస్పెక్టర్లు వెంకటయ్య, ఉమేష్, ఈఈ ప్రవీణ్ గౌడ్, సిబ్బంది పాల్గొన్నారు.

## పంచాయతీల హస్తగతంపై శుభాకాంక్షలు

- తాండూరు ఎమ్మెల్యేను మెచ్చుకున్న నటరాజన్.

**వికారాబాద్ జిల్లా. డిసెంబర్ 17.తాండూర్/**

ఏఐసీసీ తెలంగాణ రాష్ట్ర వ్యవహారాల ఇంచార్జీ మీనాక్షి నటరాజన్ తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డిని అభినందించారు. బుధవారం మీనాక్షి నటరాజన్ ను ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి మర్యాద పూర్వకంగా కలిశారు. వికారాబాద్ జిల్లా తాండూరు నియోజకవర్గంలో తొలి



విడతలో జరిగిన పంచాయతీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ మద్దతు దారులను అత్యదిక స్థానాల్లో గెలిపించుకోవడంతో పాటు, నియోజకవర్గంలో 25 పంచాయతీలను ఏకగ్రీవం చేయడం పట్ల ఎమ్మెల్యే మనోహర్ రెడ్డిని అభినందించారు. అదేవిధంగా పార్టీ పరంగా చేపట్టాల్సిన కార్యక్రమాలపై చర్చించారు. రానున్న ఎంపిటీసి, జడ్పీటీసీ ఎన్నికలపై కూడా చర్చించు కున్నారు. మరోవైపు ఏఐసీసీ ఇంచార్జీ మీనాక్షి నటరాజన్ తనకు అభినందనలు తెలపడంపై ఎమ్మెల్యే కృతజ్ఞతలు తెలిపారు.

## జిల్లాలో మూడవ విడత ఎన్నికల ప్రక్రియ పూర్తి

- 83.56 శాతం పోలింగ్ నమోదు.

**వికారాబాద్ జిల్లా. డిసెంబర్ 17.**

2 వ సాధారణ పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో వికారాబాద్ జిల్లాలో మూడవ విడత ఎన్నికల ప్రక్రియ ప్రశాంతం గా పూర్తి చేయడం జరిగిందని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ప్రతీక్ జైన్ తెలిపారు. బుధవారం జిల్లాలోని 5 మండలాల్లో జరిగిన మూడవ విడత ఎన్నికల సందర్భంగా... 83.56 శాతం పోలింగ్ నమోదు అయ్యిందన్నారు. జిల్లాలో పంచాయతీ ఎన్నికలు పకడ్బందీగా జరిగేందుకు పూర్తి స్థాయిలో చర్యలు తీసుకోవడం జరిగిందని తెలిపారు.మూడవ విడత ఎన్నికల ప్రక్రియలో సూక్ష్మ పరిశీలకులు, ఫ్లయింగ్ స్క్వాడ్, మండల పరిషత్ అభివృద్ధి అధికారులు, పంచాయతీ, కార్యదర్శులు, పోలీస్ సిబ్బంది, పోలింగ్ అధికారులు సమన్వయంతో సమర్ధవంతంగా విధులు నిర్వహించారని తెలిపారు. ఎలాంటి ఇబ్బందులు లేకుండా పారదర్శకమైన ఎన్నికలు నిర్వహించడం



జరిగిందని తెలిపారు. మొదటి, రెండవ ,మూడవ విడత గ్రామ పంచాయతీ ఎన్నికలు ముగిసిన నేపథ్యంలో గ్రామ పంచాయతీ ఎన్నికల్లో గెలుపొందిన అభ్యర్థులు, వారి ప్రతినిధులు కానీ ఎవ్వరు విజయోత్సవ ర్యాలీలు, బహిరంగ సమావేశాలు, ఊరేగింపులు జరుపుకోవద్దని,గ్రామ పంచాయతీ ఎన్నికలు మూడు విడతలు పూర్తి అయినా కూడా, మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ అమలులో ఉంటుందని, ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలను జారీ చేసే వరకు కోడ్ అమలులో ఉంటుందని తెలిపారు.నియమ నిబంధనలు అతిక్రమించిన వారిపై చర్యలు తప్పవని అన్నారు.

## వికారాబాద్‌లో ఎస్.ఐ.ఓ 2026 క్యాలెండర్ ఆవిష్కరణ

**వికారాబాద్, డిసెంబర్ 17 :**

వికారాబాద్ ఆలంపల్లిలోని మస్జిద్-ఎ-మొహియుద్దీన్‌లో స్టూడెంట్స్ ఇస్లామిక్ ఆర్గనైజేషన్ (ఎస్.ఐ.ఓ) వికారాబాద్ యూనిట్ ఆధ్వర్యంలో 2026 నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఘనంగా ఆవిష్కరించారు. ప్రతి సంవత్సరం మాదిరిగానే సామాజిక బాధ్యతలో భాగంగా, నైతిక విలువలను పెంపొందించే లక్ష్యంతో ఎస్.ఐ.ఓ ఈ క్యాలెండర్‌ను రూపొందించింది. ఈ క్యాలెండర్‌లో ఎంపిక చేసిన పవిత్ర ఖురాన్ వాక్యాలను ఉర్దూ, తెలుగు మరియు ఆంగ్ల భాషలలో వాటి అనువాదాలతో సహా ముద్రించడం విశేషం. అన్ని వర్గాల ప్రజలకు ఆధ్యాత్మిక మరియు నైతిక సందేశాలను సులభంగా చేరవేయాలనే ఉద్దేశంతో ఈ త్రిభాషా క్యాలెండర్‌ను తీసుకువచ్చినట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ క్యాలెండర్లు ప్రస్తుతం వికారాబాద్‌లోని ఆలంపల్లి ప్రాంతంలో ఉన్న రహ్నుమా సెంటర్‌లో అందుబాటులో ఉన్నాయని, ఆసక్తి గల వారు వీటిని పొందవచ్చని ఎస్.ఐ.ఓ ప్రతినిధులు ఈ సందర్భంగా ప్రకటించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రముఖులు మరియు సంస్థ సభ్యులు పాల్గొన్నారు.



# ఢిల్లీలోనే సీఎం రేవంత్ మకాం

## అక్కడే ఉండడంతో రాజకీయంగా చర్చలు

హైదరాబాద్,డిసెంబర్17తెలంగాణ సీఎం రేవంత్ హస్తినలో మూడు రోజుల నుంచి మకాం వేశారు. ముఖ్యమంత్రి ఢిల్లీ వెళ్ళడం కొత్తకాదు, పార్టీ పెద్దలు, కేంద్ర మంత్రుల్ని కలవడమూ కొత్త కాదు.. మరి ఇప్పుడే ఎందుకు ప్రత్యేకంగా అక్కడే ఉ ండిపోవడంపై సర్వత్రా చర్చ సాగుతోంది. ఫుట్‌బాల్ స్టార్ మెస్సీ హైదరాబాద్ టూర్ ముగిసిన వెంటనే సీఎం రేవంత్‌రెడ్డి ఢిల్లీ పర్యటనకు వెళ్ళిపోయారు. మ్యాచ్ చూడ్డానికి వచ్చిన కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీతో కలిసి ఉప్పల్ స్టేడియం నుంచే నేరుగా ఢిల్లీ వెళ్ళిపోయారు. ఓట్‌చోరీ అంటూ 14న అక్కడ రామ్ లీలా మైదానంలో పార్టీ నిర్వహించిన నిరసన కార్యక్రమంలో పాల్గొన్నారు. పార్టీ ముఖ్యులతో కూడా భేటీ అయ్యారు. ఇక మంగళవారంనాడు సోనియాగాంధీ, ఇద్దరు కేంద్ర మంత్రులతో కూడా సమావేశమయ్యారు. అంతవరకు బాగానే ఉన్నా? సీఎం ఇన్ని రోజులు ఢిల్లీలో ఉండటం మీదనే రకరకాల అనుమానాలు, చర్చలు వస్తున్నాయి. వాస్తవానికి సోమవారం ఉదయమే ఆయన హైదరాబాద్ తిరిగి వస్తారని అంతా భావించారు. అలా కాకుండా మూడు రోజులు ఢిల్లీలో మకాం వేశారంటే?ఏదో జరిగిపోతోందన్న గుసగుసలు వినిపిస్తున్నాయి. అయితే రాహుల్ కూడా అక్కడ లేడు. ఆయన జర్మనీ పర్యటనకు వెళ్లారు. సీఎం ఢిల్లీ టూర్‌కు ముందే మాట్లాడిన పీసీసీ అధ్యక్షుడు మహేష్‌గౌడ్ క్యాబినెట్ పునర్ వ్యవస్థీకరణకు కసరత్తు జరుగుతోందని ప్రకటించారు. దీంతో ఆ విషయమై సీరియస్‌గా పర్కొట్ చేయడం కోసమే ముఖ్యమంత్రి ఇన్నాళ్ళు ఢిల్లీలో ఉన్నారా అన్నది కూడా అనుమానమే. ఇదే అయితే రాహుల్ ఉంటేనే ఇది ముందుకు సాగుతుంది. అదే సమయంలో మరిన్ని అనుమానాలు కూడా ఉన్నాయి . హైదరాబాద్



రవీంద్రభారతిలో సోమవారం నాడు దివంగత గాయకుడు ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం విగ్రహావిష్కరణ జరిగింది. ఆ కార్యక్రమానికి సీఎం రేవంత్‌రెడ్డి వస్తున్నట్లు చెప్పారు. ఉ దయం 11 గంటల నుంచి సాయంత్రం మూడు గంటల దాకా ఇదే మాట వినిపించింది. ఎస్పీ బాలు విగ్రహాన్ని సీఎం ఆవిష్కరిస్తారని అనుకున్నా కానీ జరగలేదు. రాష్ట్ర మంత్రి శ్రీధర్ బాబు, మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్య నాయుడు, మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ, తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు రామచందర్‌రావు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ క్రమంలో సీఎం రాకపోవడానికి.. ఢిల్లీ మీటింగ్స్‌కు మించిన ప్రత్యేక కారణాలు వేరే ఉన్నాయా అన్న అనుమానాలు వస్తున్నాయి. ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం విగ్రహాన్ని రవీంద్రభారతిలో పెట్టడాన్ని వ్యతిరేకించారు కొందరు తెలంగాణ కవులు. రాష్ట్ర గీతంగా ఉన్న జయ జయ జయహే తెలంగాణ పాటను అప్పట్లో పాడటానికి ఎస్పీబీ నిరాకరించారని, అలాంటి గాయకుడి విగ్రహం ఇక్కడ ఎందుకంటూ.. పృథ్వీ లాంటి తెలంగాణా ఉ ద్యమకారులు అభ్యంతరం చెప్పారు. ఇది మెల్లిగా పెరిగి వివాదాస్పద స్థాయికి చేరుకుంది. అందుకే ఢిల్లీలో ఉన్న సీఎం రేవంత్ విగ్రహావిష్కరణకు డుమ్మా కొట్టారన్నది కొందరి విశ్లేషణ. రాష్ట్ర ప్రభుత్వం తరపున మంత్రి శ్రీధర్ బాబును పంపించి తాను మాత్రం కావాలనే ఢిల్లీలో పార్టీ పెద్దలు, కేంద్ర మంత్రులతో షెడ్యూల్ పెట్టుకున్నారని అనుమానించే వాళ్ళు సైతం ఉన్నారు. మంగళవారంనాడు ఢిల్లీలో బిజీ షెడ్యూల్‌లోనే ఉన్నారు సీఎం. పార్టీ పెద్ద సోనియాగాంధీతో ప్రత్యేకంగా భేటీ అయ్యారు. కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌ని కలిసి రాష్ట్రంలో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ ఏర్పాటుకు సహకరించమని విజ్ఞప్తి చేశారు. మొత్తం 105 స్కూల్స్ పెట్టాలనుకుంటున్నందున వీటి కోసం తీసుకునే రుణాలను ఎఫ్ఆర్బీఎం నుంచి మినహాయించాలని నిర్మలను కోరారు సీఎం. తర్వాత కేంద్ర మానవ వనరుల శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌ను కలిసి రాష్ట్రంలో ఐఐఎం ఏర్పాటుకు కావాల్సిన 200 ఎకరాల భూమిని గుర్తించామని చెప్పారు. అనుమతులు మంజూరు చేస్తే అవసరమైన వసతులు కల్పిస్తామని కూడా వివరించారు. ఇకపోతే బుధవారం రాష్ట్రపతి ద్రౌపది ముర్ము హైదరాబాద్‌కు వచ్చారు. ఆమెకు డిప్యూటీ సిఎం భట్టి స్వాగతం పలికారు. షెడ్యూల్ ప్రకారం సిఎం రేవంత్ రెడ్డి స్వాగతించాలి. కానీ ఢిల్లీలోనే ఉ ండిపోవడంతో రాలేకపోయారు. ఎవరి అనుమానాలు ఎలా ఉన్నా.. ఈ మూడ్రోజులు అక్కడే ఎందుకు మకాం వేశారన్న దానిపై అనుమానాలు కలుగుతూనే ఉన్నాయి.

# ఢిల్లీ కాలుష్యంపై మరోమారు సుప్రీం సీరియస్

## టోల్ ప్లాజాలు మూసేయాలని ఆదేశం



న్యూఢిల్లీ, డిసెంబర్17:దేశ రాజధాని ఢిల్లీని కాలుష్యం ముప్పు తిప్పలు పెడుతోంది. స్వచ్ఛమైన గాలి లేక నరకయాతన పడుతున్నారు. బయటకు రావాలంటేనే హడలెత్తిపోతున్నారు. నగర వాసులు ఆందోళనలు చేపడుతున్నారు. ఇంకోవైపు పార్లమెంట్ వేదికగా విపక్ష నాయకులు కూడా పోరాటం చేస్తున్నారు. అయినా కూడా సమస్యకు పరిష్కారం దొరకడం లేదు. తాజాగా ఈ వ్యవహారంపై దేశ సర్వోన్నత న్యాయస్థానం కూడా సీరియస్ అయింది. కాలుష్యాన్ని నియంత్రించడానికి అధికారులు ఇప్పటి వరకు తీసుకున్న చర్యలు పూర్తిగా విఫలమయ్యాయంటూ మందలించింది. టోల్ ప్లాజాల దగ్గర ట్రాఫిక్ రద్దీ, పెరుగుతున్న వాయు కాలుష్యానికి తీవ్రమైన ఆందోళన కలిగించే అంశాలుగా పేర్కొంది. తక్షణమే టోల్ ప్లాజాలను మూసేయాలని ఆదేశించింది. తాత్కాలిక నష్టాలను పౌర సంస్థతో భర్తీ చేసుకోవచ్చని సూచించింది. కాలుష్య నియంత్రణ కోసం తాత్కాలిక లేదా స్వల్ప కాలిక చర్యలు కాకుండా దీర్ఘకాలిక ప్రణాళిక అవసరం అని భారత ప్రధాన న్యాయమూర్తి సూర్యకాంత్ నేతృత్వంలోని ధర్మాసనం పేర్కొంది. ఢిల్లీ ప్రభుత్వం పాఠశాలలను మూసివేయడం, ఆన్‌లైన్ తరగతులను అనుమతించడంపై సవాళ్లు సహా పిల్లలపై కాలుష్యం ప్రభావంపై దాఖలైన పిటిషన్లను విచారించిన కోర్టు.. జోక్యం చేసుకోవడానికి నిరాకరించింది. ఇటువంటి చర్యలు తాత్కాలిక ఉపశమనం కల్పించడానికి ఉద్దేశించిన మధ్యంతర విధాన నిర్ణయాలు అని పేర్కొంది. శీతాకాలంలో పాఠశాలలు 10 నుంచి 15 రోజులు మూసివేయబడతాయని ధర్మాసనం తెలిపింది. ఏ కారణంతోనైనా ఎటువంటి బలవంతపు చర్యలు తీసుకోకూడదని ధర్మాసనం పేర్కొంది. ఢిల్లీ ప్రభుత్వం తరపున హాజరైన అదనపు సొలిసిటర్ జనరల్ ఐశ్వర్య భాటి మాట్లాడుతూ.. పాత వాహనాలు కాలుష్య సా- ్థయిలను మరింత దిగజారుస్తున్నాయని తెలిపారు.



## డయాబెటిస్ వారికి ఎంతో
# మేలు చేసే పండ్లు ఇవే!

ఈ రోజుల్లో చాలా మంది చిన్న వయసులోనే వివిధ ఆరోగ్య సమస్యలతో ఇబ్బంది పడుతున్నారు. వాటిలో డయాబెటిస్ కూడా ఒకటి. మారుతున్న జీవనశైలి, ఆహారపు అలవాట్లు, శారీరక శ్రమ లేకపోవడం వంటి అంశాలు డయాబెటిస్‌కు కారణవ-ఎవుతాయని ఆరోగ్య నిపుణులు అంటున్నారు. అయితే, డయాబెటిస్ ఉన్నవారు తరచుగా ఏం తినాలి, ఏవ తినకూడదు అనే దాని గురించి ఆందోళన చెందుతారు. అయితే, డయాబెటిస్ ఉన్న వారికి ఈ పండ్లు ఎంతో మేలు చేస్తాయని ఆరోగ్య నిపుణులు అంటున్నారు. ఈ పండ్లు షుగర్ లెవెల్స్‌ను కంట్రోల్ చేస్తాయని చెబుతున్నారు.

**సిట్రస్ పండ్లు:**

నిమ్మకాయలు, నారింజ, చిలగడదుంప వంటి సిట్రస్ పండ్లలో విటమిన్ సి పుష్కలంగా ఉంటుంది. సిట్రస్ పండ్లలో అనేక ఇతర పోషకాలు, శక్తివంతమైన యాంటీఆక్సిడెంట్లు కూడా ఉంటాయి. వీటిలో చక్కెర చాలా తక్కువగా ఉంటుందని నిపుణులు అంటున్నారు. వాటిలో ఉండే ఫైబర్ జీర్ణక్రియను మెరుగుపరుస్తుంది. అందువల్ల, డయాబెటిస్ ఉన్నవారు వాటిని వారి రోజువారీ ఆహారంలో చేర్చుకోవాలని నిపుణులు అంటున్నారు.

**రాస్ప్బెర్రీస్:**

రాస్ప్బెర్రీస్‌లో కేలరీలు చాలా తక్కువగా ఉంటాయి. అవి మన శరీరానికి అవ-సరమైన విటమిన్లు, ఖనిజాలు, యాంటీఆక్సిడెంట్లతో కూడా సమృద్ధిగా ఉంటాయి. రాస్ప్బెర్రీస్‌ను ప్రతిరోజూ తినడం వల్ల మధుమేహ వ్యాధిగ్రస్తులకు ప్రయోజనకరంగా ఉంటుంది. వాటిని తీసుకోవడం వల్ల గుండె ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చు. ఇవి జీర్ణక్రియను కూడా మెరుగుపరుస్తాయని నిపుణులు అంటున్నారు.

**స్ట్రాబెర్రీలు:**

చాలా మంది కొంచెం తీపిగా, కొంచెం పుల్లగా ఉండే స్ట్రాబెర్రీలలో చక్కెర ఎక్కువగా ఉంటుందని అనుకుంటారు. కానీ ఇది నిజం కాదు. 100 గ్రాముల స్ట్రాబెర్రీలలో 7 గ్రాముల చక్కెర మాత్రమే ఉంటుంది. అందువల్ల, మధుమేహ వ్యాధిగ్రస్తులు వాటిని నిస్సందేహంగా తినవచ్చని నిపుణులు అంటున్నారు.

**కివి:**

ఈ పండ్లలో విటమిన్ సి, యాంటీఆక్సిడెంట్లు, ఇతర ముఖ్యమైన పోషకాలు పుష్కలంగా ఉన్నాయి. వీటిని తినడం వల్ల గుండె ఆరోగ్యం కూడా మెరుగుపడుతుంది. ఇవి ఎముకల ఆరోగ్యాన్ని కూడా ప్రోత్సహిస్తాయని నిపుణులు అంటున్నారు. 100 గ్రాముల కివి పండులో కేవలం 9 గ్రాముల చక్కెర మాత్రమే ఉంటుంది.

**అవకాడో:**

అవకాడోలో విటమిన్లు C, E, K, B ఉంటాయి. ఈ విటమిన్లు అనేక ఆరోగ్య సమస్యల నుండి రక్షించడంలో సహాయపడతాయి. వీటిని మీ రోజువారీ ఆహారంలో చేర్చుకోవడం వల్ల బరువు తగ్గవచ్చని నిపుణులు అంటున్నారు. ఇది మీ రక్తంలో చక్కెరను కూడా నియంత్రిస్తుంది. సగం అవకాడోలో 0.66 గ్రాముల చక్కెర మాత్రమే ఉంటుంది. అందువల్ల, మధుమేహ వ్యాధిగ్రస్తులు ప్రతిరోజూ అవకాడో తినాలని నిపుణులు సిఫార్సు చేస్తున్నారు.



# పెద్దలకు ప్రత్యేక ఆహారం!

మనదేశం 'యువ భారత్'గా వెలిగిపోతున్నది. గణాంకాలను పరిశీలిస్తే.. యువతే ఎక్కువ సంఖ్యలో కనిపిస్తున్నది. అదే సమయంలో 60 ఏళ్లు పైబడిన వారి సంఖ్యా.. ఇక్కడ అధికంగానే ఉన్నది. దాదాపు 14 కోట్ల మంది వృద్ధులకు భారత్ నీడనిస్తున్నది. 2050 నాటికి.. ఆ సంఖ్య రెట్టింపయ్యే అవకాశం ఉన్నది. కానీ, పెద్దవాళ్ల ఆరోగ్యం మాత్రం అధిక నిర్లక్ష్యానికి గురవుతున్నది. ఈ క్రమంలో వారి ఆరోగ్యానికి మందులతో కాకుండా.. ఆహారంతోనే భరోసా ఇవ్వాల్సిన అవసరం ఉన్నది.

వృద్ధాప్యం అంటే అనారోగ్యం కాదు. అదో శారీరక మార్పు మాత్రమే! వయసు పెరిగే కొద్దీ.. కండరాల ద్రవ్యరాశి తగ్గుతుంది. రక్తంలో చక్కెరశాతం పెరుగుతుంది. ఫలితంగా, ఆరోగ్యంపై ప్రభావం పడుతుంది. ఈ క్రమంలో అనేక శారీరక మార్పులు సంభవిస్తాయి. ఈ మార్పులను అర్థం చేసుకుంటూ, అందుకు అనుగుణంగా ఆహారాన్ని అందిస్తే.. వృద్ధుల ఆరోగ్యానికి భరోసా దక్కుతుంది.

**పోషకాల అవసరం..**

వయసు పెరిగేకొద్దీ శరీరానికి పోషకాల అవసరం పెరుగుతుంది. కానీ, జీర్ణక్రియ నెమ్మదిస్తుంది. కడుపులోని ఆమ్లం, ఎంజైమ్‌ల స్థాయిలూ తగ్గుతాయి. ఫలితంగా, ప్రొటీన్ శోషణపై ప్రతికూల ప్రభావితం పడుతుంది. ఇలాంటి సమయంలో పెద్దవాళ్లకు గంజి, పులియబెట్టిన ఆహారాలు, తేలికైన సుగంధ ద్రవ్యాలు, అప్పుడే వండిన భోజనం అందించాలి. ఇవన్నీ జీర్ణక్రియను సులభతరం చేస్తాయి. పోషకాల శోషణను మెరుగుపరుస్తాయి. పెద్దల ఆహారంలో కూరగాయలు ఎక్కువగా ఉండేలా జాగ్రత్త పడాలి. ప్రాసెస్ చేసిన ఆహార పదార్థాలను పూర్తిగా పక్కన పెట్టాలి. ఇక ఒక్కపూట కూడా భోజనం మానేయడం మంచిదికాదు. పోషకాహారంతోపాటు అన్నిరకాల జాగ్రత్తలు తీసుకుంటే.. మెరుగైన ఆరోగ్యం సొంతమవుతుంది. ఇక వృద్ధాప్యంలో పలకరించే బ్రెయిన్ ఫాగ్ కూడా ఆమడదూరం పారిపోతుంది. ఎందుకంటే.. న్యూరోట్రాన్స్‌మిటర్ కార్యకలాపాలు తగ్గడానికీ, శరీరంలో ఆరోగ్యకరమైన కొవ్వులు లేకపోవడానికీ సంబంధం ఉంటుందని పలు సర్వేలు తేల్చాయి కూడా.

# మెడికల్ కాలేజీలు ప్రైవేట్‌కు ధారాదత్తం

- జగన్ హయాంలో 17 మెడికల్ కాలేజీలు ప్రారంభం
- పేదలకు వైద్యం అందుబాటులోకి తేవాలన్న లక్ష్యం
- వైసీపీ స్టేట్ కో ఆర్డినేటర్ సజ్జల రామకృష్ణారెడ్డి

అమరావతి, డిసెంబర్17:మాజీ సీఎం వైఎస్ జగన్ విజన్‌తో 17 మెడికల్ కాలేజీల నిర్మాణం చేపట్టారని, ప్రతి పార్లమెంట్ నియోజకవర్గంలో ఒక సూపర్ స్పెషాల్టీ ఆస్పత్రి ఉండాలన్నది సంకల్పించారని వైసీపీ స్టేట్ కో ఆర్డినేటర్ సజ్జల రామకృష్ణారెడ్డి అన్నారు. ప్రభుత్వ వైద్యశాలలు వస్తే ఆరోగ్యశ్రీ ఖర్చులు తగ్గుతాయని జగన్ భావించారన్నారు. సీఎం చంద్రబాబు ప్రభుత్వ మెడికల్ కాలేజీలను ప్రైవేట్ పరం చేస్తున్నారని మండిపడ్డారు. విద్య, వైద్యం పూర్తిగా ప్రైవేట్ పరం అయితే ప్రభుత్వం ఉండి ఏం లాభం అని.. ఇది పీపీపీ కాదు, పెద్ద స్కామ్ అన్ని ÷ర్ అయ్యారు. ఏదైనా ప్రైవేటుకు వెళ్తే ప్రజలకి నష్టమే అని సజ్జల రామకృష్ణారెడ్డి పేర్కొన్నారు.'వైఎస్ జగన్ చాలా కృషి చేసి 17 ప్రభుత్వ మెడికల్ కాలేజీలు తీసుకువచ్చారు. సీఎం చంద్రబాబు ప్రభుత్వం అన్యాయంగా ప్రైవేట్ పరం చేస్తానంటుంది. ప్రైవేటుపరం అయిపోతే పేదల పరిస్థితి ఏంటి?. విద్య, వైద్యం పూర్తిగా ప్రవేటు అయిపోతే ప్రభుత్వం ఉండి ఏం లాభం?. ప్రైవేట్ అత్యుత్తమం అని చంద్రబాబు చెప్పడం దారుణం. ప్రైవేట్ వాళ్ళు ఎందుకు సర్వీస్ చేస్తారు?. సొంతగా సర్వీస్ చేస్తే పర్లేదు ప్రభుత్వ ఆస్తులు కట్టబెట్టాక ఏంటి?. ఇది పీపీపీ కాదు పెద్ద స్కాం. ప్రజల నుంచి పెద్ద ఎత్తున స్పందన వచ్చింది. విభజన తర్వాత ఇంత స్పందన రావడం ఇదే మొదటిసారి. అన్ని వర్గాల ప్రజలు స్వచ్ఛందంగా ముందుకొచ్చి సంతకాలు చేశారు. రాష్ట్ర వ్యాప్తంగ 1.4 కోట్ల సంతకాలు వచ్చాయి. ప్రజల స్పందనకి చంద్రబాబు కొంచం తగ్గారు. ప్రభుత్వ అనే పేరు ఉంటుంది అంటున్నాడు. పేరు ఒక్కటే ఉంటే ఏమి ఉపయోగం.. అన్ని ఇచ్చి ప్రైవేటుకి ఇవ్వడం ఏంటి?. రాష్ట్రంలో చాలా మెడికల్



కాలేజీలు హాస్పిటల్స్ ప్రభుత్వం నడపడం లేదా?. రెండేళ్ళు జీతాలు ఇస్తాం అంటున్నారు.. వాటికి అయ్యే ఖర్చుతో కాలేజీలు పూర్తి చెయ్యండి. ఏ విద్యార్థి అయినా ప్రభుత్వ మెడికల్ కాలేజీలో చదవాలని కోరుకుంటారు. అవసరం లేకపోయినా చంద్రబాబు ప్రైవేటీకరణను నెత్తిన పెట్టుకున్నాడు' అని సజ్జల మండిపడ్డారు. 'సీఎం చంద్రబాబు సిద్ధాంతమే ప్రవేటీకరణ. మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడటమే. చంద్రబాబు ఇక్కడితో ఆగడు పీహెచ్సీలు కూడా ప్రయివేటుకు ఇస్తాను అంటాడు. చంద్రబాబు రాష్టానికి తీరని ద్రోహం చేస్తున్నాడు. కోటి నాలుగు లక్షల 11 వేల సంతకాలు వచ్చాయి. బ్యాలెట్ బాక్స్ లో ఓటు వేసినట్టే ప్రజలు తీర్పు ఇచ్చారు. ప్రజల నిర్ణయాన్ని చంద్రబాబు గౌరవించాలి.. కావాలి అంటే క్రెడిట్ నువ్వే తీసుకో. చంద్రబాబుకి క్రెడిట్ చోరీ చెయ్యడం అలవాటే కదా. చంద్రబాబు ఈ వయసులో ప్రజల ఉసురు పోసుకోవద్దు.. నిర్ణయం మార్చుకో. మిగిలిన రంగాల్లో ప్రైవేటీకరణ వేరు.. మెడికల్ కాలేజీలు వేరు. ఏదైనా ప్రైవేటుకు వెళ్తే ప్రజలకి నష్టమే. రోడ్లు పీపీపీలో జరుగుతున్నాయి..

# ముథోల్‌లో భారీగా ఓటర్ల తరలిరాక

## సమయం ముగిసినా క్యూలో ఓటర్లు



నిర్మల్,డిసెంబర్17: పంచాయతీ ఎన్నికల్లో స్థానిక ప్రజలు ఓటేసేందుకు భారీగా తరలి వచ్చారు. దీంతో గ్రామాల్లో పోలింగ్ 85శాతం వరకు చేరుకుంది. నిర్మల్ జిల్లా ముథోల్ పోలింగ్ కేంద్రంలో ఓటర్లు క్యూలైన్‌లో బారులు తీరి కనిపించారు. పోలింగ్ సమయం ముగిసినా క్యూలో ఉ ండడంతో వారికి ఓటేసేందుకు అధికారులు అనుమతించారు. మధ్యాహ్నం ఒంటి గంట లోపు పోలింగ్ కేంద్రానికి చేరుకున్న ఓటర్లకు సిబ్బంది టోకెన్లు అందజేశారు. దాదాపు 10 వేలకు పైగా ఓటర్లు కలిగిన ఈ పంచాయతీలో సర్పంచ్ పదవి కోసం 10 మంది అభ్యర్థులు పోటీ పడుతున్నారు. భారీ సంఖ్యలో ఉన్న ఓటర్లకు అనుగుణంగా పోలింగ్ కేంద్రాలను ఏర్పాటుచేయకపోవడంతో ఇబ్బందులు తలెత్తాయి. మొత్తం 16 వార్డులకు గాను ఒక్క వార్డు ఏకగ్రీవమైంది. మిగిలిన 15 వార్డులకు సరిపడేలా పోలింగ్ కేంద్రాలను ఏర్పాటుచేయలేదు. మరోవైపు ఈ 15 వార్డుల్లో 50 మంది అభ్యర్థుల వరకు పోటీలో ఉన్నారు. దీంతో ఓటు హక్కు వినియోగించుకునేందుకు వచ్చిన ఓటర్లంతా పోలింగ్ కేంద్రాల వద్ద బారులు తీరారు. ఓటు వేసే వారందరికీ ప్రవేశం, నిష్క్రమణ ఒకే మార్గం కావడంతో రద్దీ పెరిగింది.

EDITOR, PRINTED, PUBLISHED AND OWNER, **BINGI SATHAIAH** YAADHARTHAVAADHI TELUGU DAILY, PRINTED AT MEGHA PRINTERS, H NO.11-52, INDIRA NAGAR, SIDDIPET-502103, YAADHARTHAVAADHI@GMAIL.COM
TELTEL/02022, RNI/2023/85376 # 11-52, INDIRA NAGAR PRASHANTH NAGAR, SIDDIPET-502103, PUBLISHED FROM: H NO.11-52, INDIRA NAGAR, SIDDIPET-502103, TELANGANA STATE. CELL:8500765666, 9491330519